## శ్రీరాముడి గుడికి రక్షణ ఇవ్వలేని వారు దేశాన్ని ఎలా కాపాడుతారు?




వివరాలు మెయిన్‌లో...


# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం
కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

మంగళవారం | 30 జూన్, 2026 | పేజీలు : 08


# ప్రజావాణి దరఖాస్తులు సత్వర పరిష్కారం

### జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా

**ప్రజాపక్షం/కరీంనగర్:**ప్రజావాణికి వచ్చే దరఖాస్తులను పెండింగ్ లో ఉంచకుండా క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ప్రజావాణి నిర్వహించగా.. అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, శ్రీనివాస్ రెడ్డి, డీఆర్ఓ స్వామి, వివిధ శాఖల అధికారులతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రజావాణి కి మొత్తం 225 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో అత్యధికంగా గృహ నిర్మాణ శాఖకు 102, కరీంనగర్ నగరపాలికకు 62 దరఖాస్తులు వచ్చాయి.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వివిధ శాఖలలో పెండింగ్ లో ఉన్న కోర్టు కేసులు, ప్రజావాణి దరఖాస్తులను ఆరోహణ క్రమంలో పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలోని హాస్టళ్ల లో ఏర్పాటుచేసిన ఆర్వో ప్లాంట్ల వివరాలు, విద్యార్థుల సంఖ్య, గతంలో ప్లాంట్లను మరమ్మత్తు చేసిన ఏజెన్సీల వివరాలతో గూగుల్ షీట్ లో నమోదు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

### రెడ్ క్రాస్ లో సభ్యత్వం తీసుకోవాలి

సమాజ సేవ, ఆపదలో ఉన్నవారికి సాయం అందించేందుకు రెడ్ క్రాస్ లో సభ్యత్వం తీసుకోవాలని కలెక్టర్ చిత్రా మిశ్రా పిలుపునిచ్చారు. రాష్ట్రంలోనే మన జిల్లా సభ్యత్వ నమోదులో ముందు ఉండేలా ఉద్యోగులు భాగస్వాములు కావాలని పేర్కొన్నారు.





### ఎస్సి స్టడీ సర్కిల్ ను సద్వినియోగం
### సివిల్స్ శిక్షణ ప్రవేశపరీక్షకు గడువు తేదీ జూలై 12

పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులు ఎస్సి స్టడీ సర్కిల్ సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ చిత్రా మిశ్రా పేర్కొన్నారు. యుపిఎస్సి (సివిల్స్)–2027కి సన్నద్ధమయ్యే ఎస్సి అభ్యర్థులకు టిజి ఎస్సి స్టడీ సర్కిల్ హైదరాబాద్ ద్వారా శిక్షణ అందించనున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ఎస్సిస్టడీ సర్కిల్ ద్వారా అందించే శిక్షణ కరపత్రాలను కలెక్టర్.. ఉన్నతాధికారులతో కలిసి ఆవిష్కరించారు. తమ కుటుంబ వార్షికాదాయం రూ.మూడు లక్షలు ఉన్న ఎస్సిఅభ్యర్థులు శిక్షణ కోసం వచ్చే నెల 12వ తేదీ లోగా ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వారికి జులై 17న ప్రవేశపరీక్ష నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారికి శిక్షణ అందించనున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. శిక్షణ కాలంలో భోజన వసతి కల్పించి స్టడీ మెటీరియల్ అందించనున్నట్లు సోషల్ వెల్ఫేర్ ఇన్‌చార్జి డిప్యూటీ డైరెక్టర్ తిరుపతిరావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వానికి – ప్రజలకు మధ్య వారధి మీడియా

### రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



**ప్రజాపక్షం/జగిత్యాల:** ప్రజలకు ప్రభుత్వ విధానాలు, సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను చేరవేయడంలో మీడియా కీలకమైన వారధిగా పనిచేస్తుందని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు.సోమవారం జగిత్యాల కలెక్టరేట్ లో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లాలోని వర్కింగ్ జర్నలిస్టులకు 2026–28 సంవత్సరమునకు గాను అక్రిడిటేషన్ నూతన అక్రిడేషన్ కార్డులను మంత్రి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో మీడియా నాలుగో స్థంభమని, ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకురావడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో మీడియా పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. వాస్తవాలను నిష్పాక్షికంగా ప్రజలకు అందిస్తూ సమాజాభివృద్ధికి జర్నలిస్టులు చేస్తున్న సేవలు ప్రశంసనీయమని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందని, వారి సంక్షేమం కోసం అనేక చర్యలు చేపడుతోందని మంత్రి తెలిపారు. అక్రిడిటేషన్ కార్డులు జర్నలిస్టుల విధి నిర్వహణలో ఎంతో ఉపయోగపడతాయని, బాధ్యతాయుతమైన వార్తలతో ప్రజల విశ్వాసాన్ని మరింత పెంచాలని కోరారు.జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షలను ప్రభుత్వానికి, ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో మీడియా వారధిగా నిలుస్తోందన్నారు. జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో జర్నలిస్టులు అందిస్తున్న సహకారం అభినందనీయమని పేర్కొన్నారు.జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూప్రభుత్వ సమాచారాన్ని ప్రజలకు వేగంగా, పారదర్శకంగా చేరవేయడంలో మీడియా పాత్ర ఎంతో కీలకమని అన్నారు. జర్నలిస్టులు వాస్తవాలను ధృవీకరించి బాధ్యతాయుతమైన వార్తలను అందించాలని సూచించారు. జిల్లా యంత్రాంగం తరఫున మీడియాకు ఎల్లప్పుడూ అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు.అనంతరం మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ జిల్లాలోని వర్కింగ్ జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులను అందజేశారు.ఈ కార్యక్రమంలో జగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్ సమీండ్ల వాణి, డిఆర్‌పిఒ శ్రీధర్, కమిటీ సభ్యులు,తదితరులు ఉన్నారు.

## వామపక్షాల ఆధ్వర్యంలో 1న కలెక్టరేట్ ఎదుట ధర్నా



**ప్రజాపక్షం/నిజామాబాద్ :**ఇళ్ల పట్టాలు, ఇందిరమ్మ ఇళ్లకు జూలైన 1న వామపక్షాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట జరిగే ధర్నాను జయప్రదం చేయండని సిపిఎం జిల్లా కార్యదర్శి రమేష్ బాబు కోరారు. సోమవారం సిపిఐ జిల్లా కార్యాలయంలో వామపక్ష పార్టీల సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకున్న నిరుపేదలకు అదేవిధంగా అర్హులైన నిరుపేదలకు పట్టాలివ్వాలని ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ జూలై 1న జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నాకు వామపక్ష పార్టీలు రాష్ట్రవ్యాప్తంగా పిలుపునిచ్చామన్నారు. అందులో భాగంగా కలెక్టరేట్ ఎదుట జరిగే ధర్నాకు తరలిరావలని కోరారు. తెలంగాణలో గుడిసెలు లేని రాష్ట్రంగా మారుస్తామని హామీనిచ్చామని ఆ హామీని నిలబెట్టుకోవాలన్నారు. ప్రభుత్వానికి ప్రజల సమస్యలను తెలియజేయటం కోసం జరిగే జూలై 1న ధర్నాలను ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్, సిపిఐఎంఎల్ మాస్‌లైన్ నగర కార్యదర్శి ఎం.సుధాకర్, ఆర్ఎస్‌పి నాయకులు నరేష్, ఐఎఫ్‌టియు జిల్లా ఉపాధ్యక్షులు శివరాజ్, వామపక్షాల నాయకులు నల్లాల నర్సయ్య, రాధాకుమార్, గోపాల్‌సింగ్ ఠాకూర్ పాల్గొన్నారు.

## దుమాల ఏకలవ్య గురుకుల విద్యాలయంలో కలెక్టర్ తనిఖీ

### విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసిన జిల్లా కలెక్టర్ గరిమా అగ్రవాల్



**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట :** నిత్యం విధి నిర్వహణలో బిజిబిజీగా ఉండే జిల్లా కలెక్టర్ విద్యార్థులకు భోధన చేస్తున్న తీరును వారితోకూర్చుని పరిశీలిస్తూ ...పాఠ్యాంశం విన్నారు.ఎల్లారెడ్డిపేట మండలం దుమాల ఏకలవ్య రెసిడెన్షియల్ గురుకుల విద్యాలయంలో సోమవారం తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఇంటర్ ఫస్టియర్ ఎకనామిక్స్ పాఠ్యంశం ఉపాధ్యాయుడు భోధిస్తుండగా జిల్లా కలెక్టర్ గరిమా అగ్రవాల్ తరగతి గదిలోకి వెళ్ళి విద్యార్థులతో కలిసి బెంచిపై కూర్చున్నారు.అనంతరం డైనింగ్ హాల్‌కు వెళ్ళి విద్యార్థులు భోజనం చేస్తుండగా ముందుగా మెనూ పరిశీలించి సిద్ధం చేసిన ఆహార పదార్థాలను తనిఖీ చేశారు.వారితో కలిసి భోజనం చేశారు.మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా అడిగి తెలిసుకున్నారు.ఏమైన ఇబ్బందులు ఉన్నాయా అని ఆరా తీశారు.ప్రతివిద్యార్థి ప్రణాళిక ప్రకారం చదవాలని ప్రభుత్వ వసతులను సద్వినియోగం చేసుకోవాలని,ప్రతి విద్యార్థి అనుకున్న లక్ష్యం చేరుకోవాలని లైబ్రరీలో పుస్తకాలతో పాటు దినపత్రికలు చదవాలని తెలిపారు.దీంతో అన్ని విషయాలపై అవగాహన వస్తుందని జిల్లా కలెక్టర్ గరిమా అగ్రవాల్ వివరించారు.పరిశీలనలో ప్రిన్సిపల్ ఫాతిమా ,ఎంపీడీఓ సత్తయ్య అధికారులు పాల్గొన్నారు.

# టిఆర్ఎస్‌లో చేరికలు

ప్రజాపక్షం /చొప్పదండి : తెలంగాణ రక్షణ సేన పార్టీలో సోమవారం పట్టణంలో మండల మైనార్టీ నాయకులు ఎండి బషీర్ ఆధ్వర్యంలో చేరికలు జరిగాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నియోజకవర్గ ఇంచార్జీ మ్యాకల తిరుపతి సమక్షంలో చందు, శివ, జగదీష్ రాజేశ్, ఖలీద్ అజీమ్, అదిల్, లడ్డు, మేరజ్, అస్లాం, ఫారుక్‌లు చేరగా వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రకటించిన పంచజన్య కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు పిట్టల సత్తన్న, రాకేశ్ రెడ్డి పాల్గొన్నారు.
ఈ వార్తకు ఫోటో ఉంది.

# సమయానికి వర్షాలు పడి ప్రజలు బాగుండాలి


ప్రజాపక్షం/జమ్మికుంట:జమ్మికుంట పట్టణ పరిధిలో వర్షాలు సరైన సమయానికి సమృద్ధిగా పడి ప్రజలంతా సంతోషంగా ఉండాలని జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ అన్నారు. ఇటీవల వర్షాలు సరైన సమయానికి పడడం లేదని అన్నపూర్ణ సేవాసమితి ఆధ్వర్యంలో బొమ్మలగుడి శివాలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చైర్మన్ ప్రశాంత్ కుమార్ పరమ శివునికి అభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సకాలంలో వర్షాలు కురిసి పాడి పంటలతో ఆయురారోగ్యాలతో పట్టణ ప్రజలే కాకుండా తెలంగాణలోని ప్రజలందరూ సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ చందా రాజు, లెంకలపల్లి శరత్, యాంసాని సురేశ్, రవీందర్ రెడ్డి, రఘు, చంద్రమౌళి శ్రీనివాస్ రాజన్న, శివ శంకర్, అన్నపూర్ణ సేవాసమితి ఆలయ అర్చకులు, శివభక్తులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



ప్రజాపక్షం /గంగాధర:అతివేగంగా వచ్చిన కారు బైక్‌ను వెనుక నుంచి బలంగా ఢీకొట్టడంతో ఒకరు అక్కడికక్కడే మృతి చెందిన ఘోర సంఘటన గంగాధర మండలంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఆదివారం రాత్రి సమయంలో వెంకంపల్లికి చెందిన గుండవేణి కొమురయ్య (45) తన టివిఎస్ ఎక్స్‌ఎల్ టిఎస్ 02 ఈవి 5671 బైక్‌పై గొర్ల కాపల కోసం వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. పిట్టలపల్లి జంక్షన్ దాటిన తర్వాత ఐకేపి సెంటర్ వద్ద బోయిన్‌పల్లి వైపు వెళ్తున్న టిఎస్ 21 డి 3450 నంబర్ గల కారును విలాసాగర్‌కు చెందిన పోలే మహేశ్ అతివేగంతో అజాగ్రత్తగా నడుపుతూ వెనుక నుంచి బైక్‌ను బలంగా ఢీకొనడంతో కొమురయ్య తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదం జరిగిన వెంటనే కారు డ్రైవర్ వాహనాన్ని వదిలి పెట్టి పరారయ్యాడు. సమాచారం అందుకున్న గంగాధర ఎస్సై వంశీకృష్ణ ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రహరీ గోడ సమస్య పరిష్కరించాలని కలెక్టర్‌కు వినతి



ప్రజాపక్షం / కరీంనగర్ టౌన్ : చొప్పదండి రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన వడ్లూరి లింగయ్య తన స్వంత స్థలంలో ప్రహరీ గోడ నిర్మాణం చేపడుతుండగా కొందరు వ్యక్తులు ఉద్దేశపూర్వకంగా అడ్డంగులు సృష్టిస్తూ దాడులు, బెదిరింపులకు పాల్పడుతున్నారని స్థానిక పోలీస్ స్టేషన్‌లో సంప్రదించగా పోలీసు అధికారులు ఇది తమ పరిధి కాదు అని పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఈ మేరకు సోమవారం ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. గత 41 సంవత్సరాలుగా రాజీవ్‌నగర్ కాలనీలోని తన స్వంత ఇంటిలో నివాసం ఉంటున్నానని కొంతకాలంగా కల్లేపెల్లి ఆనంద్, కల్లేపెల్లి శారద, కల్లేపెల్లి గోపమ్మ, కల్లేపెల్లి గోపాల్ మున్సిపల్ ఉద్యోగి వారి కుటుంబ సభ్యులతో భూవివాదం కొనసాగుతుందని తెలిపారు. ఇప్పటికే పలుమార్లు దాడులు జరగడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసులు నమోదయ్యాయని పేర్కొన్నారు. అనంతరం కోర్టును ఆశ్రయించగా తనకు అనుకూలంగా ఇంజక్షన్ ఉత్తర్వులు జారీ అయ్యాయని తెలిపారు. కోర్టు ఆదేశాల మేరకు ప్రహరీ గోడ నిర్మాణం చేపడుతున్నప్పటికీ ప్రత్యర్థులు పనులు అడ్డుకోవడం, కూలీలను బెదిరించి పంపించడం, కుటుంబ సభ్యులపై సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేయడం అసభ్య పదజాలంతో దూషించడం జరుగుతోందని ఆరోపించారు. కోర్టు ఉత్తర్వులు ఉన్నప్పటికీ నిర్మాణ పనులు కొనసాగించకుండా అడ్డుపడుతున్నారని దీంతో తీవ్ర ఆర్థిక నష్టం కలుగుతోందని వాపోయారు. ఈ విషయంపై పలుమార్లు పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ తగిన చర్యలు తీసుకోవడం లేదని సంబంధిత అధికారులపై కూడా ఫిర్యాదులో ఆరోపణలు చేశారు. కోర్టు ఉత్తర్వులను అమలు చేసేలా పోలీస్ రక్షణ కల్పించి తన స్వంత స్థలంలో ప్రహరీ గోడ నిర్మాణం పూర్తి చేసుకునేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ను కోరారు.

# అర్జీల పరిష్కారం సత్వరమే

## జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరి

ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ : అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలని, ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి అర్జీలను పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరి సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరి కలెక్టరేట్ సమావేశం మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు.పెద్దపల్లి జిల్లాకు చెందిన షమీమ్ సుల్తాన తనకు ఇంటి స్థలం కరీంనగర్ లో ఉన్నందున ఇందిరమ్మ ఇల్లు కరీంనగర్లో మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా పిడి హౌసింగ్ కు రాస్తూ పరిశీలించాలని డిఆర్ఓ తెలిపారు.రామగుండం జై భీమ్ నగర్ కు చెందిన గూపాల స్వామి తాను పక్షవాతంతో బాధపడుతున్నానని తనకు ఏదైనా ఉద్యోగం ఇప్పించాలని ఎంబీఏ చదువు పూర్తి చేశానని కోరుతూ దరఖాస్తు చేసుకోగా వారధి అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. ధర్మారం మండలం మేడారం గ్రామానికి చెందిన సాన కొమురయ్య అంగన్వాడి టీచర్ గా పని చేస్తున్న కుటుంబం నుంచి అక్రమంగా దివ్యాంగుల పెన్షన్, వితంతు పెన్షన్ పొందుతున్న వారిపై చట్ట ప్రకారమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా జిల్లా సంక్షేమ అధికారికి రాస్తూ పరిశీలించి చర్యలు తీసుకోవాలని అన్నారు.ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టరేట్ డి.విభాగ పర్యవేక్షకులు ఈశ్వర ప్రసాద్, సంబంధిత జిల్లా అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదులకు సత్వర పరిష్కారం

## జగిత్యాల కలెక్టర్ సత్యప్రసాద్



ప్రజాపక్షం/జగిత్యాల టౌన్ : ప్రజావాణి అర్జీల పై సమగ్ర విచారణ జరిపి సమస్యలను త్వరగా పరిష్కరించాలని అధికారులను జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ప్రజల నుండి ఫిర్యాదులు,వినతులను స్వీకరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూపలు సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని పలు మండలాల నుండి ప్రజలు సమస్యలు విన్నవించుకోడానికి ప్రజావాణికి వస్తారని, అధికారులు వారి శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యల పై సమగ్ర విచారణ చేపట్టి పరిష్కారానికి చొరవ చూపాలని అన్నారు.అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కాగా ఈరోజు నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 98 ఫిర్యాదులు,వినతులు వచ్చాయని,వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు.అనంతరం ఇదివరకు ప్రజావాణి లో వచ్చిన 197 పెండింగ్ దరఖాస్తులు త్వరగా పరిష్కరించాలని లేని యెడల సంబంధిత జిల్లా అధికారి బాధ్యునిగా చేస్తూ మెమో జారీ చేయబడునని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్లు బి. ఎస్. లత, బి. రాజ గౌడ్,రెవెన్యూ అధికారి ప్రసాద్, సంబంధిత జిల్లా స్థాయి అధికారులు,మున్సిపల్ కమిషనర్ లు పాల్గొన్నారు.

# ధర్మపురి పట్టణ సమగ్రాభివృద్ధికి కృషి

## మున్సిపల్ చైర్ పర్సన్ నాగలక్ష్మి

ప్రజాపక్షం/ధర్మపురి : ధర్మపురి పట్టణ సమగ్ర అభివృద్ధికి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సహకారం తో కృషి చేస్తామని ధర్మపురి మున్సిపల్ చైర్ పర్సన్ వేముల నాగలక్ష్మి రాజేష్ అన్నారు.ధర్మపురి పట్టణ అభివృద్ధిలో భాగంగా సోమవారం 13వ వార్డులో నూతన సిసిరోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులకు ధర్మపురి మున్సిపల్ చైర్పర్సన్ వేముల నాగలక్ష్మి జిల్లా గ్రంధాలయ చైర్మన్ సంఘనబట్ల దినేష్ తో కలిసి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సహాయ సహకారాలతో ధర్మపురి పట్టణంలో అభివృద్ధి పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయని తెలిపారు.ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా ప్రతి వార్డులో అవసరమైన రోడ్లు, డ్రైనేజీలు, ఇతర అభివృద్ధి పనులను దశలవారీగా చేపడుతున్నామని పేర్కొన్నారు.13వ వార్డులో చేపట్టిన సిసిరోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులు పూర్తయిన అనంతరం స్థానికులకు మెరుగైన రవాణా సౌకర్యంతో పాటు పారిశుద్ధ్య పరిస్థితులు కూడా మెరుగుపడనున్నాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఇందారపు రామన్న,13వ వార్డు కౌన్సిలర్ చీపిరిశెట్టి రాజేష్,కౌన్సిలర్లు సంగి ఆనంద్, సంఘనబట్ల సంతోష్,ఒజ్జల లక్ష్మణ్,మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు ఎస్ కె. షౌకత్ ,ప్రజా ప్రతినిధులు, అధికారులు,వార్డు ప్రజలు,పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉచిత వైద్య శిబిరం

ప్రజాపక్షం / కరీంనగర్ టౌన్ : కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ ఆధ్వర్యంలో సోమవారం విద్యారణ్యపురి కాలనీలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సింగరేణి ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులు స్థానిక ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి నిపుణులైన వైద్యులు ఉచితంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో సాధారణ వైద్యంతోపాటు ఎముకలు, కీళ్ల సమస్యలు, జనరల్ సర్జరీ, స్త్రీ ప్రసూతి వ్యాధులకు సంబంధించిన పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. రక్తపోటు, మధుమేహం, ఈసీజీ, బీఎంఐ తదితర పరీక్షలను ఉచితంగా చేశారు. శిబిరంలో జనరల్ మెడిసిన్ డా.లోకేశ్, ఆర్థోపెడిక్ అండ్ జాయింట్ రీప్లేస్మెంట్ నిపుణులు డా.రాకేశ్, జనరల్ సర్జన్ డా.అబ్దుల్ వారిస్ ఉస్మానీ, స్త్రీ ప్రసూతి వైద్య నిపుణురాలు డా.నయన పాల్గొని రోగులను పరీక్షించి వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను వారి ప్రాంతానికే తీసుకెళ్లాలనే ఉద్దేశంతో ఇటువంటి ఉచిత వైద్య శిబిరాలను నిరంతరం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ శిబిరంలో ఆసుపత్రి మార్కెటింగ్ మేనేజర్ కోట కరుణాకర్, సంతోష్, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర యువజన అదనపు కార్యదర్శిగా మైలారపు రాంబాబుకు ఘన సన్మానం



ప్రజాపక్షం /మెట్‌పల్లి : ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర యువజన అదనపు కార్యదర్శిగా నియమితులైన మెట్‌పల్లి పట్టణ ఆర్య వైశ్య సంఘం అ ధ్యక్షుడు మైలారపు రాంబాబును వాసవి గార్డెన్ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా వాసవి గార్డెన్ అధ్యక్షుడు కోట కిరణ్ కుమార్, కార్యదర్శి డి. రమేష్, కోశాధికారి బందారి ప్రసాద్, సంయుక్త కార్యదర్శి ఆమెటి సందీప్, సహాయ కార్యదర్శి మంచాల రాజేష్ శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.రాష్ట్ర స్థాయిలో కీలక బాధ్యతలు చేపట్టిన మైలారపు రాంబాబు ఆర్యవైశ్య సమాజ అభివృద్ధికి మరింత సేవలందించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ఆర్యవైశ్య సంఘ సభ్యులు పాల్గొని రాంబాబుకు అభినందనలు తెలియజేశారు.

# మురికి నీరు వ్యర్థాలతో పంటలు నాశనం

ప్రజాపక్షం/మల్లాపూర్ : మల్లాపూర్ నుండి దామరాజు పెల్లి వెళ్లే రహదారి పక్కన ఉన్న పంట పొలాల్లోకి గ్రామంలోని మురికి నీరు, వ్యర్థాలు డ్రైనేజీ ద్వారా పంట పొలాల్లో చేరి తమ పంటలు నాశనం అవుతున్నాయని చర్యలు తీసుకోవాలని కోరుతూ బాధిత రైతులు గ్రామ సర్పంచ్ చిట్యాల లక్ష్మణ్,పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ కు సోమవారం వినతి పత్రాన్ని అందజేశారు. ప్రతిఏటా మురికి నీరుతో పాటు గాజు పెంకులు ఇతర వ్యర్థాలు పంట పొలాల్లోకి చేరి పంటలు పనికిరాకుండా పోతున్నాయని, కాలువ ద్వారా మురికి నీరును మళ్లించి తమ నాదుకోవాలని ఇచ్చిన వినతి పత్రం కోరారు.ఈ కార్యక్రమంలో రైతులు కొప్పెల లక్ష్మీ రెడ్డి అరిగెల రాజారెడ్డి,గడ్డం నర్సారెడ్డి,కోలా తుక్కన్న ,కోల గంగారెడ్డి,నల్ల రాజారెడ్డి,గోపిడి శేఖర్,తదితరులున్నారు.

# ప్రైవేట్ పాఠశాల వద్దు .. ప్రభుత్వ పాఠశాల ముద్దు

ప్రజాపక్షం/రాయికల్ : ప్రైవేట్ పాఠశాల వద్దు ప్రభుత్వ పాఠశాలనే ముద్దు అని వీరాపూర్ సర్పంచ్ దిండిగాల గంగు రామస్వామి అన్నారు. సోమవారం రాయికల్ మండలం ప్రాథమిక పాఠశాల వీరాపూర్ లో గ్రామ సర్పంచ్ దిండిగాల గంగురామస్వామి గౌడ్ ప్రభుత్వ పాఠశాల పై నమ్మకంతో తమ మనుమరాలు అయినటువంటి దిండిగాల వైశిక ను ఒకటో తరగతిలో చేర్పించడం జరిగింది. అదేవిధంగా వార్డ్ మెంబర్ నీలి మమత తమ కూతురు అయినటువంటి నీలి దాక్షాయని ను 2వ తరగతిలో చేర్పించడం జరిగింది.దీనిని స్ఫూర్తిగా తీసుకొని గ్రామంలోని తల్లిదండ్రులందరూ తమ పిల్లల్ని వీరాపూర్ ప్రభుత్వ పాఠశాలలో చేర్పించుటకు ఉత్సాహం చూపుతున్నారు.గ్రామపంచాయతీ కార్యవర్గ తీర్మానం మేరకు ఇప్పటివరకు పాఠశాలలో సుమారు 70 మంది పిల్లలు చేరారు.ముగ్గురు ప్రైవేటు ఉపాధ్యాయులను నియమించారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నర్సారెడ్డి,వార్డు సభ్యులు మరియు గ్రామ పంచాయతీ సెక్రెటరీ ,ఉపాధ్యాయులు ,తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## నూతన తహసీల్దార్‌ను కలిసిన మున్సిపల్ చైర్మన్

**ప్రజాపక్షం/జమ్మికుంట:** జమ్మికుంట మండల తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన గడ్డం సుధాకర్‌ని సోమవారం జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. తహసీల్దార్‌ను కలిసినవారిలో చైర్మన్‌తోపాటు నాయకులు కొలకని రాజు, పోలు భిక్షపతి, పోల్నేని వేణుగోపాల్ తదితరులు ఉన్నారు.

## పదవీ విరమణ పొందిన ఆర్‌టిసిడ్రైవర్ వీరయ్య దంపతులకు సన్మానం

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్:** తెలంగాణ ఆర్‌టిసిసంస్థ హుజూరాబాద్ డిపోలో డ్రైవర్‌గా 29 సంవత్సరాలపాటు విశిష్ట సేవలందించిన సోదరుడు గౌరిశెట్టి వీరన్న జూన్ 30, 2026న పదవీ విరమణ పొందుతున్న సందర్భంగా, డిపో యాజమాన్యం మరియు బంధువులు,మిత్రులు సోమవారం హుజూరాబాద్ డిపో ఆవరణలో డ్రైవర్ గౌరిశెట్టి వీరయ్య దంపతులను శాలువాలతో సత్కరించి, పూల బొకేలు అందజేసి ఘనంగా సన్మానించింది.ఈ కార్యక్రమంలో వీరయ్య బంధువులు,మిత్రులు యెనిమిండ్ల శ్రీనివాస్, రామన్న, లచ్చన్న, వెలగందుల సత్యనారాయణ,శివనాథుల వెంకటరమణ,లింగమూర్తి,క్రిష్ణమూర్తి,ఈశ్వరయ్య పాల్గొని పదవీ విరమణ శుభాకాంక్షలు తెలిపా రు.

## ముత్తారం డిప్యూటీ తహసీల్దార్‌గా మహేష్ కుమార్ బాధ్యతల స్వీకరణ

**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల నూతన డిప్యూటీ తహసిల్దార్ (డీటీ)గా మహేష్ కుమార్ సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు.ఇప్పటివరకు ఇక్కడ డిప్యూటీ తహసిల్దార్‌గా విధులు నిర్వహించిన షఫీ మహమ్మద్ డిప్యుటేషన్‌పై ఓదెల మండలానికి బదిలీ అయ్యారు.ఈ నేపథ్యంలో ఓదెల మండలంలో డీటీగా పనిచేస్తున్న మహేష్ కుమార్ బదిలీపై ముత్తారానికి వచ్చారు.ఈ సందర్భంగా విధుల్లో చేరిన నూతన డిప్యూటీ తహసిల్దార్ మహేష్ కుమార్‌కు మండల రెవెన్యూ అధికారులు,జీపీఓలు, కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి ఘనంగా స్వాగతం పలికారు .మండల ప్రజలకు అందుబాటులో ఉం టూ ,రెవెన్యూ సేవలను వేగంగా అందిస్తానని ఈ సందర్భంగా నూతన డీటీ పేర్కొన్నారు.

## 42వ గిరి ప్రదక్షిణ

**ప్రజా పక్షం/మల్యాల :** జగిత్యాల జిల్లా మల్యాల మండలం కొండగట్టులో ప్రతి నెల పౌర్ణమి రోజు నిర్వహించే 42వ గిరిప్రదక్షిణ సోమవారం అత్యంత వైభవంగా కొనసాగింది.ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా భక్తులు తెల్లవారు జామునే కొండగట్టు కు చేరుకొని గిరి ప్రదక్షిణ లో పాల్గొన్నారు.వేలాదిగా తరలి వచ్చిన భక్తులతో కొండగట్టు ప్రాంతం కిక్కిరిసి పోయింది.కొద్ది మందితో మూడు సంవత్సరాల క్రితం సురేష్ ఆత్మ రామ్ ఆధ్వర్యంలో ప్రారంభం అయిన గిరి ప్రదిక్షణకు విశేష స్పందన లభిస్తుంది.

# ఎస్‌సి ,ఎస్‌టిలపై దాడి చేసిన వారిపై కేసులు నమోదు

### దళిత సంఘాల ఐక్యవేదిక నాయకులు కలెక్టర్కు వినతి



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** పెద్దపల్లి జిల్లాలో దళితులపై దాడి చేసిన వారిపై వెంటనే కేసులు నమోదు చేసి, కేసులను నిర్వీరం కాకుండా చర్యలు చేపట్టాలని దళిత సంఘాల ఐక్యవేదిక నాయకులు సోమవారం రోజున ప్రజా వారిలో జిల్లా కలెక్టర్కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జూలపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి అనంతల లచ్చయ్య పైన కులం పేరుతో దూషించి దాడి చేసిన జూలపల్లి ఉప సర్పంచ్ కొప్పుల మహేష్ ను ఇంత వరకు అరెస్టు చేయలేదనీ, కాల్వ శ్రీరాంపూర్ మండలం పెగడపల్లి గ్రామంలో రేణుక ఎల్లమ్మ దేవాలయ ప్రవేశం దళితులను నిరాకరించిన వారిపై ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని,జెడ్‌పిహెచ్‌ఎస్‌నిట్టూరు పాఠశాల ఉపాధ్యాయుడు లింగంపల్లి శంకరయ్యను కుట్రపూరితంగా సస్పెండ్ చేయించిన రోహిన్ కుమార్, వినోద్,సమ్మయ్యలను ఇంత వరకు సస్పెండ్ చేయలేదనీ, గోదావరిఖని సింగరేణి మహిళాపై సమాజం తలదించుకునేలా అసభ్య కరమైన పాట రిలీజ్ చేసిన వారిని ఇంతవరకు గుర్తించలేదనీ, ఈ కేసులలో నిందితులను వెంటనే అరెస్టు చేయాలని, అలాగే దళిత యువకుడు జూల వంశీ హత్యకాబడిన కుటుంబానికి ప్రభుత్వం నుండి పూర్తి ఆర్థిక సహాయం అందలేదనీ, ధర్మారం మండలం నంది మేడారం గ్రామంలో ఆదర్శ వివాహం చేసుకున్న ముద్రవేణి సంతోష్ బిసి, జనగామ సౌందర్య లను గ్రామంలో కుల బహిష్కరణ చేశారని, వారిని తిరిగి అదే కులంలో చేర్చాలని, కాల్వ శ్రీరాంపూర్ మండలం కునారం గ్రామంలో దళిత పేద వర్గాలకు చెందవలసిన భూములు అన్యక్రాంతమునకు గురికావడం జరిగిందనీ, వీటిపైన చర్యలు తీసుకొని వాళ్లకు భూములు ఇప్పించాలని,వీటితో పాటు జిల్లాలో ఇతర సమస్యలపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వీటిపై వెంటనే చర్యలు చేపట్టాలని లేనిపక్షంలో ఎస్సీ ఎస్టీలు అందరం కలిసి దశల వారి పోరాటాలను చేసి మా హక్కులను సాధించుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలు సంఘాల ఐక్యవేదిక నాయకులుమామిడిపల్లి బాపయ్య ,పాటకుల మహేష్,కోటగిరి పాపయ్,బొల్లి స్వామి,కట్కూరు సందీప్,బొంకూరి సుభాష్,దొడ్డే బాపు,ఉండంటి ప్రభాకర్,ఎర్రవెల్లి సురేందర్ రాజు,కుక్క నంబయ్యా,తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ భవనాన్ని ప్రారంభించిన మంత్రి అడ్లూరి



**ప్రజాపక్షం/గొల్లపల్లి :** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని గంగాదేవిపల్లె గ్రామంలో నూతనంగా నిర్మించిన అంగన్వాడి భవనాన్ని సోమవారం తెలంగాణ రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చిన్నారుల సమగ్ర వికాసానికి గర్భిణులు, బాలింతలకు మెరుగైన సేవలు అందించడంలో అంగన్వాడి కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు.ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో నాణ్యమైన మౌలిక వసతులు కల్పిస్తూ ప్రతి చిన్నారికి మెరుగైన విద్య, పోషకాహారం,ఆరోగ్య సేవలు అందేలా కృషి చేస్తోందని పేర్కొన్నారు.నూతన అంగన్వాడి భవనం ద్వారా గ్రామంలోని చిన్నారులు మహిళలకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని మంత్రి తెలిపారు.అంగన్వాడి స్థాయి నుంచే పిల్లలకు పౌష్టికాహారం అందించడంతో పాటు మెరుగైన వసతులు కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని ,చిన్నారుల ఆరోగ్యాభివృద్ధి విద్యాభ్యాసానికి అంగన్వాడి కేంద్రాలు కీలక వేదికలుగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు.చిన్నారులకు మొదటి గురువుగా అంగన్వాడి టీచర్లు బాధ్యత వహించాలని సూచించారు . ఈ సందర్భంగా చిన్నారులకు దుస్తులను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బీమా సంతోష్ ,వైస్ చైర్మన్ పురపాటి రాజిరెడ్డి ,స్థానిక సర్పంచ్ కొలకాని జలంధర్ , ఉప సర్పంచ్ వోరుగంటి మనిసాయి ,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాపల్లి గంగన్న ,ముస్కు నిశాంత్ రెడ్డి,జెల్లా అనిల్,ప్రజాప్రతినిధులు, అధికారులు,అంగన్వాడి సిబ్బంది,కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు,గ్రామస్థులు,తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే సంజయ్ కృషితో నీటి కొరత తీరింది



**ప్రజాపక్షం /మల్లాపూర్:** మండలం రాఘవపేట గ్రామపంచాయతీ సమీపంలో నీటి కొరతతో కాలనీవాసులు పడుతున్న ఇబ్బందులు స్థానిక ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ కృషితో తొలగిపోయిందని గ్రామ సర్పంచ్ తోట శ్రీనివాస్ అన్నారు. నీటి కొరత ఉందని ఎమ్మెల్యే సంజయ్ దృష్టికి తీసుకెళ్లగానే రెండు లక్షల రూపాయలు నిధులు మంజూరు చేయగా సోమవారం బోరుబావి నిర్మాణానికి శ్రీకారం చుట్టి కాలనీవాసులకు నీటి కొరత తీర్చి అందుబాటులోకి తీసుకొచ్చారు.సమస్యను దృష్టికి తీసుకెళ్లగానే స్పందించి తమ ఇబ్బందులు తొలగించిన ఎమ్మెల్యేకు కాలనీవాసులు ,వార్డు సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మద్దెల నరసయ్య,మాజీ ఉప సర్పంచ్ ఆమీన్, బి ఆర్ ఎస్ వి నియోజకవర్గ నాయకులు బైది రవికుమార్ యాదవ్, నాయకులు రాకేష్, వెంకటస్వామి, తిరుపతి, రవి, నారాయణ, నరేష్,కాలనీ మహిళలున్నారు.

# పౌర్ణమి అన్నదాన సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదానం

### మురళీకృష్ణ దేవాలయంలో భక్తులకు మహాప్రసాద వితరణ

### ప్రతి పౌర్ణమి రోజు సేవలు కొనసాగుతాయని నిర్వాహకుల వెల్లడి

**ప్రజాపక్షం /మెట్‌పల్లి :** మెట్‌పల్లి పట్టణంలోని పౌర్ణమి అన్నదాన సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం స్థానిక మురళీకృష్ణ దేవాలయం వద్ద సుమారు వెయ్యి మంది భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పౌర్ణమి అన్నదాన సేవా సమితి గౌరవ అధ్యక్షుడు, వ్యవస్థాపకుడు మైలారపు లింబాద్రి మాట్లాడుతూ, ప్రతి పౌర్ణమి రోజున మధ్యాహ్నం 12 గంటలకు మురళీకృష్ణ దేవాలయం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిరంతరంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. సమాజంలోని దాతల సహకారంతో ఈ సేవా కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోందని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నదానాన్ని స్వీకరిస్తుండడం ఆనందంగా ఉందన్నారు.ఈ కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షుడు రాజు (ఆప్టికల్), కార్యదర్శి సముద్రాల భానుమూర్తి, కోశాధికారి దేవరశెట్టి రవీందర్, వెలగందుల జలంధర్, మరియాల ప్రభాకర్, పుల్లూరి జగదీశ్వర్, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మైలారపు రాంబాబు, స్నేహాలయ ఫ్రెండ్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కోట కిరణ్ కుమార్, సుందర సత్సంగం సభ్యులు, సేవా సమితి సభ్యులు, దాతలు,భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నదాన సేవలో భాగస్వాములయ్యారు.

## పచ్చదనం పెంచుదాం పర్యావరణాన్ని కాపాడుదాం



**ప్రజాపక్షం/రామడుగు:** మొక్కలు నాటి పచ్చదనం పెంచి పర్యావరణాన్ని కాపాడాలని రామడుగు ఎంపిడివో రాజేశ్వరి పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని షానగర్ గ్రామంలో ప్రధాన రహదారి వెంట నిర్వహించిన వన మహోత్సవం మొక్కలు నాటే కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని షానగర్ గ్రామ సర్పంచ్ గునుకొండ శైలజతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎంపిడివో, సర్పంచ్ మాట్లాడుతూ రోడ్ల వెంట ప్రభుత్వ, ప్రైవేట్ ఖాళీ స్థలాలను గుర్తించి పెద్దఎత్తున మొక్కలు నాటాలని సూచించారు. రైతుల భాగస్వామ్యం చేస్తూ రోడ్డు పక్కల నాటే మొక్కల సంరక్షణ బాధ్యతను సంబంధిత రైతులకు అప్పగించాలని వాటి ఫలాలను కూడా రైతులే పొందేలా చూడాలన్నారు. గ్రామాలు పచ్చదనంతో నిండిపోయేలా ప్రణాళిక సిద్ధం చేసుకొని వర్షాకాలంలోనే మొక్కలు నాటాలని కోరారు. ఈ కార్యక్రమంలో షానగర్ మాజీ సర్పంచ్ గునుకొండ అశోక్ కుమార్, పంచాయతీ కార్యదర్శి పొన్నం మధుసూదన్, వార్డు సభ్యులు పర్లపెల్లి పుష్పశంకర్, సైండ్ల స్వప్న తిరుపతి, పర్లపెల్లి నరేశ్, కొత్త రమ్యకృష్ణ అనిల్ , పర్లపెల్లి సురేశ్, ఎడ్ల మోహన్, మినుకల తిరుపతి, వి.రమేశ్, ఫీల్డ్ అసిస్టెంట్ కరుణ్ ఆనంద్, ఈ.నర్సయ్య, జీ.నర్సయ్య, ఉపాధి హామీ కూలీలు, గ్రామస్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## మంథని-ఎక్లాస్పూర్ రహదారిపై ఘోర ప్రమాదం

**ప్రజాపక్షం/ముత్తారం :** మంథనిఎక్లాస్పూర్ ప్రధాన రహదారిపై సోమవారం ఉదయం జరిగిన ఒక రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు.వేగంగా వచ్చిన ఒక ద్విచక్ర వాహనం అదుపుతప్పి,ఎదురుగా వస్తున్న మరో రెండు బైకులను బలంగా ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది.ఈ ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులకు శరీర భాగాలపై తీవ్ర గాయాలయ్యాయి.ఇబ్బని ప్రవీణ్ కి కుడి కాలుకు తీవ్ర గాయం,గాదం రవికి కుడి కాలి పాదానికి బలమైన గాయం,మాచిడి మహేష్ కాలికి గాయాలయ్యాయి.

**సకాలంలో స్పందించిన 108 సిబ్బంది :** ప్రమాదం జరిగిన వెంటనే స్థానిక ప్రజలు అత్యవసర సేవల విభాగం 108 సిబ్బందికి సమాచారం అందించారు. సమాచారం అందిన వెంటనే మంథని 108 అంబులెన్స్ సిబ్బంది అయిన ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ నిమ్మతి శ్రీనివాస్,పైలట్ హబీబ్ వేగంగా సంఘటనా స్థలానికి చేరుకున్నారు.వారు క్షతగాత్రులకు అక్కడికక్కడే ప్రాథమిక చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం హుటాహుటిన మంథని ప్రభుత్వ సామాజిక ఆసుపత్రికి తరలించారు. సమయస్ఫూర్తితో వ్యవహరించి ప్రాణాలు కాపాడిన 108 సిబ్బంది సేవలను స్థానికులు, ఆసుపత్రి వైద్యులు ప్రత్యేకంగా అభినందించారు.

# పూడికతో 1.4టిఎంసిలకు చేరిన నర్మాల ఎగువ మానేరు

## ఎగువ మానేరు ప్రాజెక్టును జీవనాధార ప్రాజెక్టుగా గుర్తించాలి: మానేరు పరిరక్షణ కమిటీ డిమాండ్



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** నర్మాల ఎగువ మానేరు పర్యవేక్షణ లోపంతో 76 సంవత్సరాలుగా నీటితోపాటు చేరిన మట్టి పూడికతో ప్రాజెక్టు సామర్థ్యం క్రమక్రమేనా తగ్గి 1.4టీఎంసీలకు చేరిందని మానేరు పరిరక్షణ కమిటీ కన్వీనర్ గుంటి వేణు అన్నారు. సోమవారం గంభీరావుపేట ఎగువ మానేరు ప్రాజెక్టు పరిరక్షించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ కు ప్రజావాణిలో ఎగువ మానేరు ప్రాజెక్టు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కన్వీనర్ గుంటి వేణు కో కన్వీనర్ మజార్ చాకలి రమేష్ మార్వాడి సుదర్శన్ లు మాట్లాడుతూ హైదరాబాద్ సంస్థాన్ ఏడవ నిజాం నవాబు 2.2 టీఎంసీల నీటి సామర్థ్యంతో సుమారు రెండు కోట్ల యాభై లక్షల రూపాయల ఖర్చుతో నిర్మించారనీ ఈ ప్రాజెక్టు ఈ ప్రాంత రైతులకు జీవనాధారంగా మారిందన్నారు. పాల్వంచ వాగు గుండ వెల్లి వాగు వరద నీటితో ఈ ప్రాజెక్టు నిండుతుందన్నారు. గతంలో వచ్చిన వరద కారణంగా 100 మీటర్ల ప్రాజెక్ట్ లైనింగ్ ఆఫ్రాన్ దెబ్బతిందని,కుడి, ఎడమ కాలువలను సుమారు 73 కిలోమీటర్ల మేర జాతీయ ఉపాధి హామీ పథకంలో కూలీలచే శుభ్రపరిచి అవసరం ఉన్న చోట మరమ్మత్తులు చేపట్టాల్సిన అవసరం ఉందని,3.8కిలోమీటర్ల ప్రాజెక్ట్ ఆనకట్టకు పూర్తి స్థాయిలో మరమ్మత్తులు చేపట్టాలని ప్రాజెక్ట్ 33 షటర్లకు మరమ్మత్తులు చేయాలని, ప్రాజెక్ట్ లో పూడిక తీసిన ఒండ్రు మట్టిని పరివాహక ప్రాంత రైతులకు ఉచితంగా పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. మానేరు ప్రాజెక్టు పరిరక్షణ కమిటీని ప్రభుత్వం అధికారికంగా గుర్తించి వారి విధులను ప్రకటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మానేరు పరిరక్షణ కమిటీ కో కన్వీనర్ బుస్స వేణు, బండారి బాల్ రెడ్డి, ధ్యాప దేవయ్య , కుసుమ విష్ణు, చెన్నమనేని పురుషోత్తమ రావు, పంతం రవి , మీసం లక్ష్మణ్, మల్లారెడ్డిపేట నవీన్, బైండ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రీ ప్రైమరీ తరగతుల ప్రారంభం



**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం:**జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సోమవారం ప్రీ ప్రైమరీ తరగతులను మండల విద్యాధికారి బండారి మధు ప్రారంభించారు.ఈ సందర్భంగా చిన్నారులకు ప్రత్యేక సౌకర్యాలు, ఫర్నిచర్, బొమ్మలు అందజేస్తామని తెలిపారు. తల్లిదండ్రులు చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎం రాజన్న,హెచ్ఎం వాణి, హెచ్ఎం ప్రదీప్,సీఆర్పీ రవీందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ప్రజావాణి అర్జీలు పెండింగ్‌లో పెట్టొద్దు

### జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

### ప్రజావాణికి 172 దరఖాస్తులు



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** ప్రజావాణి అర్జీలు పెండింగ్ లో పెట్టవద్దని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో సోమవారం ప్రజావాణి నిర్వహించగా, కలెక్టర్ గరిమ అగ్రవాల్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రజావాణికి మొత్తం 172 దరఖాస్తుల రాగా, వాటిని సంబంధిత శాఖల అధికారులకు అందజేసి.. వాటిని పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు.

### డివిజన్ స్థాయి ప్రజావాణిలో..

సిరిసిల్ల, వేములవాడలో ప్రజావాణి నిర్వహించి.. ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. సిరిసిల్ల ప్రజావాణికి మొత్తం 12 దరఖాస్తులు రాగా, అధికారులు స్వీకరించి సంబంధిత శాఖల అధికారులకు అందజేశారు. వాటిని పరిష్కరించాలని ఆదేశించారు. అలాగే వేములవాడ ప్రజావాణికి మొత్తం 09 దరఖాస్తులు రాగా, ఆర్డీఓ కే ఎస్ బీ కుమారి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి.. సంబంధిత శాఖల అధికారులకు అందజేశారు. వాటిని పరిష్కరించాలని ఆదేశించారు. ఈ ప్రజావాణిలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, జిల్లా రెవెన్యూ అధికారి జయశ్రీ, జెడ్పీ సీఈఓ వెంకట మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

## గ్రీవెన్స్ డేలో 26 ఫిర్యాదుల స్వీకరణ

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** గ్రీవెన్స్ డే లో వచ్చిన ఫిర్యాదులు ఆన్ లైన్ లో పొందు పరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యా యో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలందించడం జరుగుతుందని జిల్లా అదనపు ఎస్పి చంద్రయ్య అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించి వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఆర్జీదారుల నుండి 26 ఫిర్యాదులను స్వీకరించినట్లు తెలిపారు. సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులతో ఫోన్‌లో మాట్లాడి బాధితుల సమస్యలను చట్టపరంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని, పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, తద్వారా ఫిర్యాదుదారునికి పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు.

## పురుగుల మందు తాగి మహిళా మృతి

**ప్రజాపక్షం /ముస్తాబాద్ :** ముస్తాబాద్ మండలం నామపూర్ గ్రామానికి చెందిన జూకంటి సులోచన, గత కొంతకాలం నుండి ,మోకాళ్ల నొప్పులతో బాధ భరించలేక శనివారం రోజు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. అదే సమయంలో భర్త ఇంటికి వచ్చేసరికి భార్య కింద పడి ఉడటంతో,వెంటనే చికిత్స కొరకు సిద్దిపేట్ హాస్పిటల్ తరలించగా. చికిత్స పొందుతూ మృతి మృతి చెందినట్లు. భర్త జూకంటి సుధాకర్ ఇచ్చిన,ఫిర్యాదు మేరకు ఎస్సై జ్యోతి కేసు నమోదు చేసే దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

## సిరిసిల్లలో పల్స్ పోలియో ప్రత్యేక కార్యక్రమం

### జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. అంజెలా ఆల్ఫ్రెడ్



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** రాజన్న సిరిసిల్ల జిల్లాలో పల్స్ పోలియో ప్రత్యేక కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతున్నదని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. అంజెలా ఆల్ఫ్రెడ్ తెలిపారు. పోలియో బూత్‌లలో పోలియో చుక్కలు వేయించుకోలేని 0–5 సంవత్సరాల లోపు చిన్నారులను గుర్తించి వారికి పోలియో చుక్కలు అందించేందుకు జిల్లా వ్యాప్తంగా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు ఇంటింటికి వెళ్లి సర్వే నిర్వహిస్తున్నారని తెలిపారు. సోమవారం నిర్వహించిన గృహ సందర్శన సర్వే లో మొత్తం 91856 గృహాలను సందర్శించి 2249 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేయడం ద్వారా 41147 టార్గెట్ కాగా సోమవారం వేసిన వారితో కలిపి 40927 పిల్లలకు పోలియోచుక్కలువేసి 99.49 శాతం పూర్తి చేసామని పేర్కొన్నారు. సర్వే సందర్భంగా ప్రతి ఇంటిలో 0–5 సంవత్సరాల వయస్సు గల చిన్నారులను గుర్తించి, పోలియో చుక్కలు వేయించుకోని పిల్లలకు వెంటనే పోలియో చుక్కలు వేయిస్తున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి పోలియో రహిత సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని కోరారు. పోలియో వ్యాధి నివారణకు ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించడం అత్యంత అవసరమని, ఏ ఒక్క చిన్నారి కూడా మిగిలిపోకుండా జిల్లా ఆరోగ్యశాఖ ప్రత్యేక చర్యలు చేపట్టిందని స్పష్టం చేశారు.

## డొమెస్టిక్ సిలిండర్ల సీజ్

**ప్రజాపక్షం /ముస్తాబాద్ :** ముస్తాబాద్ మండల కేంద్రంలో పౌరసరఫరాల అధికారులు హోటళ్లల్లో రెస్టారెంట్లు, సబ్సిడీ గ్యాస్ దుర్వినియోగాన్ని అరికట్టడానికి అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. హోటల్లో వాణిజ్య గ్యాస్ తో పాటు గృహ సిలిండర్ల వాడడంతో హోటళ్లల్లో.రెస్టారెంట్ తనిఖీ చేసి సిలిండర్లను సీజ్ చేశారు. ఈ సందర్భంగా దుకాణాలు, హోటళ్లు, క్యాటరింగ్ వంటి వాణిజ్య అవసరాలకు గృహ (14.2 కేజీల) సిలిండర్లను వాడటం చట్టవిరుద్ధం మరియు ప్రమాదకరం. దీనివల్ల భారీ జరిమానాలు, సిలిండర్ల జప్తు లైసెన్స్ రద్దు వంటి చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. వాణిజ్య అవసరాలకు 19 కేజీల కమర్షియల్ సిలిండర్లను ఉపయోగించడం తప్పనిసరి. సిలిండర్ల గృహ వినియోగం డొమెస్టిక్ సబ్సిడీ కలిగిన 14.2 కేజీల సిలిండర్లు. వాణిజ్యలలో వినియోగించకూడదని పౌర సరఫరా అధికారి డి.టి.ఎస్ రజిత సూచించారు. ఈ తనికీలో జిపిఓ అధికారులు ఉన్నారు.

## దర్యాపూర్ ఆదర్శ పాఠశాలలో ప్రభుత్వ ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీ



**ప్రజాపక్షం/ముత్తారం :** రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల కోసం ప్రతిష్టాత్మకంగా అందిస్తున్న ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీ కార్యక్రమం సోమవారం పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం దర్యాపూర్‌లోని తెలంగాణ ఆదర్శ పాఠశాల,జూనియర్ కళాశాలలో ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ రాపెల్లి రాజయ్య హాజరై, విద్యార్థులకు ఉచిత పుస్తకాలను అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ అభివృద్ధికి విద్యే మూలాధారమని పేర్కొన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ ఉచిత విద్యా అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని, క్రమశిక్షణతో చదివి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ఆకాంక్షించారు.కళాశాల ప్రిన్సిపాల్ డా. సంతోష్ కుమార్ కేసరి మాట్లాడుతూ నాణ్యమైన విద్యను అందించడంలో ప్రభుత్వ ఉచిత పాఠ్యపుస్తకాలు ఎంతో దోహదపడతాయని తెలిపారు. విద్యార్థులు పుస్తకాలను జాగ్రత్తగా ఉంచుకుంటూ, విద్యాభ్యాసంలో ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, అధ్యాపక సిబ్బంది. విద్యార్థులు పాల్గొన్నారు.

## ఓటర్లు ఉన్న ఇంటింటికీ ఎన్యూమరేషన్ ఫారం

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్)లో భాగంగా ఓటర్లు ఉన్న ప్రతి ఇంటింటికీ ఎన్యూమరేషన్ ఫారాలు అందించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, జిల్లా రెవెన్యూ అధికారి జయశ్రీ తో కలిసి జిల్లాలోని తహసీల్దార్లతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ముందుగా మండలాల వారీగా ఎస్ఐఆర్ కింద ఎన్ని ఎన్యూమరేషన్ ఫారాలు అందించారో ఆరా తీశారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ ఇప్పటిదాకా 70 శాతం పూర్తి అయిందని తెలిపారు. మిగతా పంపిణీ వేగంగా పూర్తి చేయాలని సూచించారు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఓటర్లు ఉన్న ఇంటింటికీ ఎన్యూమరేషన్ ఫారం అందించాలని స్పష్టం చేశారు. బీ ఎల్ ఓ లు ఈ లక్ష్యాన్ని వంద శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ ప్రక్రియ అంతా పకడ్బందిగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు.వర్షాకాలం నేపథ్యంలో జిల్లాలోని తహసీల్దార్లు అందరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. భారీ వర్షాలు కురిసి లోతట్టు ప్రాంతాలు జలమయం అయినా, రోడ్లు, వంతెనలు దెబ్బతిన్న, పంటలు పాడైన, ఇండ్లు కూలిన, పశువులు చనిపోయిన, మనుషులు మృతిచెందిన ఆ వివరాలను తహసీల్దార్లు సేకరించి.. ఉన్నతాధికారులకు పంపాలని సూచించారు. చెరువులు, రిజర్వాయర్లు నిండి మత్తడి దూకే పరిస్థితుల్లో ప్రజలను అటు వైపు వెళ్లకుండా పోలీస్ వారితో సమన్వయం చేసుకుని బారికేడ్లు ఏర్పాటు చేయించాలని ఆదేశించారు. రోడ్లు, వంతెనలు దెబ్బతిన్న చోట ఆయా శాఖల అధికారులతో మరమ్మత్తు చేయించి.. రాకపోకలు సాఫీగా సాగేలా చూడాలని సూచించారు.

### త్వరితగతిన పరిష్కరించాలి..

భూ భారతి, సాదాబైనామా దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.రెవెన్యూ డివిజన్లు, మండలాల వారీగా భూ భారతి, సాదా బైనామా దరఖాస్తుల వివరాలను జిల్లా కలెక్టర్ ఆరా తీశారు. భూ భారతి పోర్టల్ ద్వారా వచ్చే దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి, త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. పట్టాదారు పాస్ పుస్తకాలు, రెవెన్యూ రికార్డులలో నమోదైన వివరాలు, వారసత్వ హక్కుల నమోదు, సర్వే నంబర్ల వారీగా భూ వివరాల ధృవీకరణ తదితర అంశాలను నిబంధనలకు అనుగుణంగా పరిశీలించి నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. సాదా బైనామా దరఖాస్తులను జాప్యం చేయకుండా క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత పత్రాలు, ఆధారాలు, గ్రామ రెవెన్యూ రికార్డులు, తదితర అంశాలను పరిశీలించి పరిష్కారం చూపాలన్నారు. రెవెన్యూ సిబ్బంది క్షేత్ర స్థాయిలో అప్రమత్తంగా ఉండేలా చూడాలన్నారు.సమీక్షలో వేములవాడ ఆర్డీఓ కె.ఎస్.బి. కుమారి, అన్ని మండలాల తహసీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

# పాత కక్షలతో వ్యక్తి దారుణ హత్య



ప్రజాపక్షం / రామకృష్ణాపూర్: మందమర్రి మండలంలోని రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్ పరిధి బొక్కలగుట్ట ప్రాంతంలో ఆదివారం రాత్రి గజ్జి వెంకటేష్ అనే వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. పాత కక్షల నేపథ్యంలోనే ఈ ఘాతుకం జరిగినట్లు స్థానికంగా కలకలం రేపింది. స్థానికుల వివరాల ప్రకారం బొక్కల గుట్ట గ్రామానికి చెందిన ఒడ్డేపల్లి రాజ్‌కుమార్ గడ్డకట్టిన సిమెంట్ బస్తాను వెంకటేష్‌పై విసిరి వేయడంతో ఆయన తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం వెంటనే ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలోనే వెంకటేష్ మృతి చెందాడు. మృతుడు వెంకటేష్‌కు, నిందితుడు రాజ్‌కుమార్‌కు మధ్య గత ఐదేళ్లుగా కుటుంబ పరమైన విభేదాలు కొనసాగుతున్నట్లు సమాచారం. ఈ పాత కక్షలతో హత్యకు దారితీసినట్లు ప్రాథమిక విచారణలో తెలుస్తోంది. ఘటనపై సమాచారం అందుకున్న రామకృష్ణాపూర్ పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

# ఓటర్ల వివరాలు బిఎల్‌ఓ యాప్‌లో స్పష్టంగా నమోదు చేయాలి

కలెక్టర్ కుమార్ దీపక్



ప్రజాపక్షం / రామకృష్ణాపూర్: ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో ఎన్యుమరేషన్ ఫారాల ద్వారా సేకరించిన ఓటర్ల సమాచారాన్ని బిఎల్‌ఓ యాప్ లో స్పష్టంగా నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలోని 21, 15 వార్డులలో కొనసాగుతున్న ఎన్యుమరేషన్ ఫారాల ప్రక్రియను సోమవారం ఆయన మండల తహసిల్దార్ సతీష్ కుమార్, ఇతర అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జూలై 24వ తేదీ వరకు నిర్వహించే ఈ ఇంటింటి కార్యక్రమాన్ని అత్యంత పారదర్శకంగా నిర్వహించాలన్నారు. బూత్ స్థాయి అధికారులు ఓటర్ల వద్దకు వెళ్లిన సమయంలో ఎన్యుమరేషన్ ఫారం అందిస్తూనే యాప్ లో మార్క్ చేయాలని సూచించారు. ఓటరు ఫారం నింపిన తర్వాత దానిని తిరిగి సేకరించి యాప్ లో వివరాలు నమోదు చేయాలన్నారు. ముఖ్యంగా మరణించిన వారు, గ్రామం వదిలి వెళ్ళిన వారు, రెండు లేదా అంతకంటే ఎక్కువ ఓటరు గుర్తింపు కార్డులు కలిగి ఉన్న వారి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టం చేశారు. ఒక వ్యక్తికి ఒకే ఓటరు గుర్తింపు కార్డు ఉండేలా స్పష్టమైన జాబితాను రూపొందించాలని ఆదేశించారు. ఎన్యుమరేషన్ ఫారాల సేకరణలో ఎలాంటి పొరపాట్లు లేకుండా వివరాలను స్పష్టంగా నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బూత్ స్థాయి అధికారులు అధికారులు పాల్గొన్నారు.

# 14 ఏళ్ల బాలికలందరికీ ఉచితంగా హెచ్‌పివి వ్యాక్సిన్ ఇప్పించాలి

వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్



ప్రజాపక్షం / మందమర్రి, కాసిపేట: ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న గర్భాశయ ముఖ క్యాన్సర్ నివారణ హెచ్‌పివి వ్యాక్సిన్‌ను 14 సంవత్సరాలు నిండిన బాలికలందరికీ ఇప్పించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ ఆదేశించారు. మందమర్రి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు కాసిపేట మండలం మామిడిగూడ గిరిజన ఉపకేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. గిరిజన ప్రాంతాల్లో అందుతున్న వైద్య సేవలు, పల్స్ పోలియో ఇంటింటి తనిఖీలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం సిబ్బందితో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ.. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. 30 ఏళ్లు పైబడిన వారికి బిపి, డయాబెటిస్ పరీక్షలు చేసి ఆన్లైన్ చేయాలని, క్షయ రోగులను గుర్తించి నిశ్చయ్ పోర్టల్ లో చేర్చాలన్నారు. వంద శాతం గర్భవతుల నమోదు జరిపి, ఆసుపత్రి ప్రసవాలు జరిగేలా చూడాలని, మలేరియా, డెంగ్యూ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుధాకర్ నాయక్, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# కవ్వాల్ టైగర్ రిజర్వ్‌లో జంగిల్ సఫారీ సేవలు తాత్కాలిక నిలిపివేత

ప్రజాపక్షం / జన్నారం: వర్షాకాలం సందర్భంగా జన్నారం అటవీ డివిజన్ పరిధిలోని కవ్వాల్ టైగర్ రిజర్వ్‌లో జంగిల్ సఫారీ సేవలను జూలై 1 నుంచి సెప్టెంబర్ 30 వరకు మూడు నెలల పాటు పూర్తిగా నిలిపివేస్తున్నట్లు ఎఫ్‌డిఒ రామ్మోహన్ తెలిపారు. భారత ప్రభుత్వ పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ, నేషనల్ టైగర్ కన్జర్వేషన్ అథారిటీ మార్గదర్శకాల మేరకు దేశంలోని అన్ని టైగర్ రిజర్వుల్లో వర్షాకాలంలో సఫారీ సేవలను తాత్కాలికంగా నిలిపివేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. అడవి జంతువుల సంతానోత్పత్తి, సహజ ఆవాసాల పరిరక్షణ, పర్యావరణ సమతుల్యతతో పాటు సందర్శకుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. మూడు నెలల పాటు



కవ్వాల్ టైగర్ రిజర్వ్‌లో జంగిల్ సఫారీ సేవలు అందుబాటులో ఉండవని, పర్యాటకులు, ప్రకృతి ప్రేమికులు తమ పర్యటనలను అందుకు అనుగుణంగా ప్రణాళిక చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వన్యప్రాణుల సంరక్షణకు ప్రజలు సహకరించాలని కోరారు.

# బురదలో కూరుకుపోయిన ఆర్‌టిసి బస్సు

ప్రజాపక్షం / హాజీపూర్: హాజీపూర్ మండలంలో దొనబండ–పెద్దంపేట గ్రామాలను కలుపుతూ ఇటీవల నిర్మించిన వంతెనకు ఇరువైపులా నాణ్యతలేని మట్టిని వేయడంతో సోమవారం టిజిఎస్ ఆర్‌టిసి బస్సు బురదలో కూరుకుపోయింది. బస్సులో సుమారు 60 మంది పాఠశాల విద్యార్థులతో పాటు ఇతర ప్రయాణికులు ఉండటంతో కొంతసేపు భయాందోళన నెలకొంది. బస్సు డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించి పరిస్థితిని అదుపులోకి తీసుకురావడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటనతో దొనబండ–పెద్దంపేట మధ్య రాకపోకలు గంటలపాటు స్తంభించగా ప్రయాణికులు, విద్యార్థులు, రైతులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

గ్రామస్థుల కథనం ప్రకారం వంతెన నిర్మాణం పూర్తయిన అనంతరం ఇరువైపులా నాణ్యతలేని నల్లరేగడి మట్టిని పోయడం వల్ల వర్షాల సమయంలో రహదారి పూర్తిగా బురదగా మారుతోంది. దీంతో వాహనాలు తరచూ ఇరుక్కుపోతున్నాయని వారు ఆరోపిస్తున్నారు. ఈ





ఘటనపై సంబంధిత కాంట్రాక్టర్ నిర్లక్ష్యాన్ని విచారించి కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే వంతెనకు ఇరువైపులా నాణ్యమైన మెటల్ వేసి, మురుగు నీటి పారుదల సదుపాయాలు కల్పించి, రహదారిని వెంటనే వినియోగానికి అనుకూలంగా మార్చాలని జిల్లా కలెక్టర్, ఆర్ అండ్ బి శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తి చేశారు.

# ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్‌కు భద్రత కల్పించాలి

బిఆర్‌ఎస్ నాయకులు నిరసన



ప్రజాపక్షం / కౌటాల: బిఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్‌కు పూర్తిస్థాయిలో భద్రత కల్పించడంతో పాటు ఆయనకు గతంలో ఉన్న బుల్లెట్‌ప్రూఫ్ వాహనాన్ని తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆ పార్టీ నాయకులు నిరసన చేపట్టారు. మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై సోమవారం బిఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజాప్రతినిధులు, ప్రముఖ నాయకుల భద్రత పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. ప్రజాక్షేత్రంలో నిరంతరం పర్యటించే ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ లాంటి నాయకుడికి భద్రతను తగ్గించడం వల్ల ప్రాణహాని ఉండే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. రాజకీయ కక్షసాధింపు చర్యల్లో భాగంగానే ప్రభుత్వం ఇటువంటి నిర్ణయాలు తీసుకుంటోందని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగక ముందే ఆయనకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ మండల ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వరల్డ్ కప్‌కు ఎంపికైన స్నేహకు అభినందనలు

ప్రజాపక్షం / ఆసిఫాబాద్: భారత జట్టు తరపున ఇంటర్నేషనల్ సౌత్ ఇండియన్ సాఫ్ట్ బేస్ బాల్ పోటీల్లో వైస్ కెప్టెన్‌గా రాణించి, జరగనున్న వరల్డ్ కప్ పోటీలకు ఎంపికైన స్నేహ మౌలాకర్‌ను కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఎక్స్ ఆర్మీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శివకుమార్ అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వరల్డ్ కప్ పోటీల్లో భారత జట్టు తరపున వైస్ కెప్టెన్‌గా బరిలోకి దిగుతున్న స్నేహ మౌలాకర్ అత్యుత్తమ ప్రతిభ కనబర్చి దేశానికి మరిన్ని విజయాలు అందించాలని ఆకాంక్షించారు. జిల్లా కీర్తిని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో చాటుతున్న క్రీడాకారులకు అన్ని వర్గాల నుంచి ప్రోత్సాహం అందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పీయూష్ ఘోష్, సునీల్ మండల్, వినాయక్, సుశాంత్ బర్మన్, రమాకాంత్ యాదవ్, విజయ్ కుమార్, ఉత్తమ్, పురుషోత్తం, బిద్యుత్ ఘోష్, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# గంజాయి నిర్మూలనకు ఎక్స్ ఆర్మీ అసోసియేషన్ మద్దతు

ప్రజాపక్షం / ఆసిఫాబాద్: జిల్లాలో గంజాయి నిర్మూలన, ట్రాఫిక్ నిబంధనల అమలుపై సంపూర్ణ సహకారం అందించాలని కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఎక్స్ ఆర్మీ అసోసియేషన్ నిర్ణయించింది. జిల్లా కేంద్రంలో నిర్వహించిన అసోసియేషన్ సమావేశంలో ఈ మేరకు తీర్మానాలు చేశారు. ఈ సందర్భంగా ఎక్స్ ఆర్మీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శివకుమార్ మాట్లాడుతూ జిల్లాలో గంజాయి మత్తుకు యువత బానిసై తమ విలువైన భవిష్యత్తును కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా పోలీసు శాఖ చేపడుతున్న గంజాయి నిర్మూలన కార్యక్రమాలకు అసోసియేషన్ పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు. గంజాయి విక్రయాలు, రవాణా, వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు అందజేసి నిర్మూలనకు సహకరిస్తామని చెప్పారు. యువత మాదకద్రవ్యాలు, ఇతర చెడు వ్యసనాలకు దూరంగా ఉండి విద్య, ఉద్యోగం, క్రీడల్లో రాణించాలని పిలుపునిచ్చారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తూ ట్రిబుల్ రైడింగ్, నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం వంటి ఘటనలు తమ దృష్టికి వస్తే పోలీసులతో సమన్వయం చేసి సంబంధిత వారికి కౌన్సిలింగ్ నిర్వహించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇదే సమయంలో భారత సైన్యంలో సేవలందించి పదవీ విరమణ పొందిన సుబేదార్ గోవింద్ మండల్, సుబేదార్ కన్జ బిస్వాస్‌లకు ఎక్స్ ఆర్మీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికి వారి సేవలను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు పీయూష్ గోష్, ప్రధాన కార్యదర్శి సునీల్ మండల్, ఆర్గనైజింగ్ సెక్రటరీ వినాయక్, సుశాంత్ బర్మన్, జాయింట్ సెక్రటరీ రమాకాంత్ యాదవ్, విజయ్ కుమార్, ఉత్తమ్, పురుషోత్తం, బిద్యుత్ గోష్, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# ఇసుక, మొరం అక్రమ తవ్వకాలపై సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు



ప్రజాపక్షం / సిర్పూర్–టి: సిర్పూర్‌టి మండల పరిధిలో అనుమతులు లేకుండా ఇసుక, మొరం అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయని ఆరోపిస్తూ పలువురు గ్రామస్థులు కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లకు, సిర్పూర్‌టి తహసీల్దార్ రహీముద్దీన్ కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. మండలంలోని పలు ప్రాంతాల్లో ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండానే భారీ యంత్రాల సహాయంతో తవ్వకాలు నిర్వహిస్తూ సహజ వనరులను అక్రమంగా తరలిస్తున్నారని ఆరోపించారు. ఈ అక్రమ తవ్వకాల వల్ల ప్రభుత్వానికి భారీ ఆదాయ నష్టం వాటిల్లడంతో పాటు పర్యావరణానికి తీవ్ర నష్టం జరుగుతోందని పేర్కొన్నారు. అక్రమ తవ్వకాల కారణంగా భూగర్భ జలాలు తగ్గిపోవడంతో వెంటనే ప్రత్యేక విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, అక్రమ తవ్వకాలను పూర్తిగా నిలిపివేసి ప్రభుత్వ నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని ఫిర్యాదుదారులు సబ్ కలెక్టర్‌ను కోరారు. సహజ వనరులను రక్షించేందుకు సంబంధిత అధికారులు నిరంతర తనిఖీలు నిర్వహించి అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఖిజర్ హుసేన్, దుర్గం విక్రమ్, బొమ్మన శ్రీనివాస్, ప్రభాకర్, లాలాజీ, తిరుపతి, దేవాజీ పాల్గొన్నారు.

## నిర్మల్ నూతన డీ.ఎస్పీ శ్రీనివాస్‌ను సన్మానించిన ఉద్యమనేత పాకాల




**ప్రజాపక్షం / నిర్మల్ :** నిర్మల్ నూతన సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్‌గా (డీ.ఎస్పీ)గా బాధ్యతలు స్వీకరించిన పి.శ్రీనివాస్‌ను తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పాకాల రాంచందర్ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. సోమవారం నిర్మల్‌లోని డీ.ఎస్పీ కార్యాలయంలో ఆయనను కలిసి మొక్కను బహూకరించి శాలు వాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నిర్మల్ డివిజన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు, ప్రజల భద్రతకు నూతన డీ.ఎస్పీ ఆద్వర్యంలో పోలీస్ శాఖ మరింత మెరుగైన సేవలు అందించాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ జిల్లా మాజీ సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు వినోద్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ దశరథ రాజేశ్వర్ అడెల్లి మాజీ సర్పంచ్ రాజు, దాసరి రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## తవ్వకాల్లో బయట పడిన పురాతన విగ్రహం

**ప్రజాపక్షం / దిలావర్‌పూర్ :** మండల కేంద్రంలోని గ్రామంలోని బన్సపల్లి గ్రామంకు వెళ్ళే రోడు నడుకుడ పోశెట్టి ఇంటి పక్కన గల తోట వాబిలో ఆదివారం జేసీబితో తవ్వకాలు జరుపుతుండగా ఒక పురాతన విగ్రహం బయటపడింది. బావిలో పురాతన విగ్రహం ఉందని సమాచారంతో బయటకి తీయాలనే ఉద్దేశ్యంతో ఉప సరఎంచ్ నడుకుడ సుఖేష్, రవి తవ్వకాలు జరిపించగా పురాతన విగ్రహం బయటకు వెళ్ళడం జరిగిందని తెలిపారు. ఇది కొన్ని వందల సంవత్సరాల విగ్రహం అని తెలిపారు. ఈ విగ్రహాన్ని మాజీ సర్పంచ్ నంద అనీల్, ఉపాధ్యాయులు అన్వేష్‌రెడ్డి, పనుల పవన్ పరిశీలించి ఇది మహా వీరుడు వీరగల్లు విగ్రహమని, పురావస్తు శాఖ వారికి సమాచారం అందిస్తామని తెలిపారు.

## ప్రీమెట్రిక్ స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తుల ఆహ్వానం

**ప్రజాపక్షం/నిజామాబాద్:** 9,10వ తరగతులు చదువుతున్న బీసీ, ఈబీసీ విద్యార్థులు 202627 విద్యా సంవత్సరానికి ప్రభుత్వం అందిస్తున్న ఫ్రీమెట్రిక్ స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి సాయికుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న అర్హులైన విద్యార్థులు తెలంగాణ ఈపాస్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంపికైన విద్యార్థులకు బీసీ సంక్షేమశాఖ తరపున రూ.4 వేల ఫ్రీమెట్రిక్ స్కాలర్‌షిప్ అందజేయనున్నట్లు తెలిపారు. ద అర్హులైన విద్యార్థులు ఆధార్ కార్డు, కుల ధృవీకరణ, ఆదాయ పత్రాలను, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, బ్యాంకు పాస్‌బుక్ కాపీ, బోనఫైడ్ సర్టిఫికెట్లతో సమీపంలోని మీ సేవ కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## హ్యామ్ ఫేజ్-1తో సిర్పూర్ నియోజకవర్గ రోడ్లకు మహర్దశ

### సిర్పూర్ ఎంఎల్ఏ డాక్టర్ పాల్వాయి హరీష్



**ప్రజాపక్షం / కాగజ్‌నగర్:** హ్యామ్ ఫేజ్1 ప్రాజెక్టు కింద సిర్పూర్ నియోజకవర్గంలోని నాలుగు ప్రధాన ఆర్ అండ్ బి రహదారులను రూ.203.76 కోట్లతో డబుల్ రోడ్లుగా అభివృద్ధి చేయనున్నట్లు సిర్పూర్ ఎంఎల్ఏ డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు తెలిపారు. నల్గొండలో ముఖ్యమంత్రి హ్యామ్ ఫేజ్1 ప్రాజెక్టులో భాగంగా ఈ రహదారుల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారని, టెండర్ల ప్రక్రియ పూర్తై త్వరలోనే పనులు ప్రారంభమవుతాయని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ రహదారుల అభివృద్ధితో నియోజకవర్గంలో రవాణా సౌకర్యాలు మెరుగుపడి ప్రజలకు, వ్యాపార రంగానికి విశేష ప్రయోజనం చేకూరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నిధుల వివరాల ప్రకారం కాగజ్‌నగర్ ఎక్స్ రోడ్డు నుంచి కాగజ్‌నగర్ మీదుగా సిర్పూర్ మండల కేంద్రం వరకు రూ.73.22 కోట్లతో డబుల్ రోడ్డు నిర్మించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా కాగజ్‌నగర్, సిర్పూర్ పట్టణాల్లో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు.

సిర్పూర్ నుంచి మహారాష్ట్ర సరిహద్దు మాకుడి వరకు రూ.10.50 కోట్లతో డబుల్ రోడ్డు నిర్మాణం చేపట్టనున్నట్లు వివరించారు. దహేగాం మండలంలోని కల్వాడ నుంచి ఒడ్డుగూడ వరకు రూ.53.52 కోట్లతో, చింతలమానేపల్లి మండలంలోని బాబాసాగర్ నుంచి గూడెం వరకు రూ.15.80 కోట్లతో డబుల్ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని పేర్కొన్నారు.

## తాటిపల్లిలో సీసీ రోడ్డు, బోరింగ్ పనులకు శంకుస్థాపన



**ప్రజాపక్షం / కౌటాల:** కౌటాల మండలం తాటిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని గోవర హేట్టి తొమ్మిదో వార్డులో సీసీ రోడ్డు నిర్మాణానికి, బెస్తవాడ వద్ద తాగునీటి సమస్య పరిష్కారం కోసం బోరింగ్ పనులకు భూమిపూజ నిర్వహించి పనులు ప్రారంభించారు. గోవర హేట్టి వార్డులో వర్షాకాలంలో రహదారి బురదమయంగా మారి ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఈ సీసీ రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అదేవిధంగా బెస్తవాడ (వాల్మీకి గుడి) వద్ద తాగునీటి ఎద్దడిని తీర్చడానికి ఉమ్మడి ఆదిలాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ దండే విట్టల్ ప్రత్యేక చొరవతో ఈ బోరింగ్ పనులు మంజూరయ్యాయి. ఈ పనులు ప్రారంభం కావడం పట్ల స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బడగే సంతోష్, ఉపసర్పంచ్ డోంగ్రే కేశవరావు, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి యుద్ధప్రాతిపదికన చర్యలు



**ప్రజాపక్షం / మందమర్రి:** సింగరేణి కార్మికుల సంక్షేమం, పెండింగ్ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా మందమర్రి ఏరియా సింగరేణి యాజమాన్యం, గుర్తింపు కార్మిక సంఘం ఏఐటియుసి మధ్య 19వ స్ట్రక్చర్ మీటింగ్ జనరల్ మేనేజర్ కార్యాలయంలో సోమవారం జరిగింది. ఏరియా జనరల్ మేనేజర్ ఎన్ రాధాకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఏఐటియుసి మందమర్రి బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, బెల్లంపల్లి బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేష్, రామకృష్ణాపూర్ బ్రాంచ్ కార్యదర్శి అక్బర్ అలీ కార్మికుల సమస్యలను యాజమాన్యం దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ మాట్లాడుతూ సంస్థ ఉత్పత్తి లక్ష్యాలతో పాటు కార్మికుల సంక్షేమానికి సమాన ప్రాధాన్యం ఇస్తుందని స్పష్టం చేశారు. సమావేశంలో ఏఐటియుసి నాయకులు అన్ని క్యాంటీన్లలో స్వచ్ఛమైన తాగునీటి సౌకర్యం కల్పించాలని, వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని టీ టైప్ క్వార్టర్లకు నల్ల టాప్ సీట్లు ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే ఏరియాలోని గనులు, విభాగాల్లో ఖాళీగా ఉన్న క్లర్క్ పోస్టులను భర్తీ చేయాలని, జవహర్ నగర్ కాలనీలో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచడంతో పాటు కొత్త రోడ్ల నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. వీటన్నింటిపై జనరల్ మేనేజర్ సానుకూలంగా స్పందిస్తూ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి అధికారులు ఎస్ఓ టు జీఎం జివిఎల్ ప్రసాద్, రాంబాబు, సంతోష్ కుమార్, అశోక్, కిరణ్ కుమార్, సురేష్, షేక్ మదీనా భాష, విజయ్ సందీప్, కార్తీక్, ఏఐటియుసి నాయకులు కంది శ్రీనివాస్, సివి రమణ పాల్గొన్నారు.

## విద్యుత్ ఉపకేంద్రాలలో కెపాసిటర్ బ్యాంక్సు ఏర్పాటు



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** విద్యుత్ ఉప కేంద్రాలలో కెపాసిటర్ బ్యాంక్సు ఏర్పాటు ప్రారంభించినట్లే ఏడీఈ కన్‌స్ట్రక్షన్ తోట రాజశేఖర్ తెలిపారు. ఎఆర్‌పీ క్యాంపు 33/11 కెవి విద్యుత్ ఉపకేంద్రంలో కెపాసిటర్ బ్యాంకు సాంకేతికంగా ప్రారంభించారు. దీని ఏర్పాటుతో వ్యవసాయదారులకు నాణ్యమైన సరఫరా వీలుంటుందన్నారు. కెపాసిటర్ బ్యాంకులతో ఓల్టేజ్ పెరుగుతుందని 33 కెవి లైన్ లాస్స తగ్గుతాయన్నారు. పవర్ ట్రాన్స్‌ఫార్మర్ పై భారం తగ్గుతుందని సిఎండి ఆదేశాల మేరకు 33/11 కెవి విద్యుత్ ఉప కేంద్రాలలో కెపాసిటర్ బ్యాంక్స్ ఏర్పాటు చేయటం జరుగుతుందన్నారు. ఉప కాలూర్, శ్రీనగర్, ఎఆర్‌పి క్యాంపు విద్యుత్ ఉపకేంద్రాల్లో పనులు ప్రారంభించామన్నారు. ఇప్పటివరకు జిల్లాలో మొదటి విడతలో 31, 2వ విడతలో 11, 3వ విడతలో 41 కెపాసిటర్ బ్యాంక్సు జిల్లాలోని విద్యుత్ ఉప కేంద్రాల్లో ఏర్పాటు చేయటం జరిగిందని స్థానిక లైన్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, లైన్‌మెన్ సాయిబాబా,శ్రీకాంత్‌నాయక్ పాల్గొన్నారు.

## అధికారుల కోసం రైతు వేదికలో రైతుల ఎదురుచూపులు



**ప్రజాపక్షం / వాంకిడి:** వాంకిడి మండల కేంద్రంలోని రైతు వేదికలో అధికారులు అందుబాటులో లేకపోవడంతో వివిధ గ్రామాల నుంచి వచ్చిన రైతులు గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. సోమవారం ఉదయం నుంచే తమ సమస్యల పరిష్కారం కోసం, వివిధ అవసరాల నిమిత్తం రైతులు ఇక్కడికి చేరుకున్నారు. అయితే మధ్యాహ్నం కావస్తున్నా సంబంధిత అధికారులు రాకపోవడంతో తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం వర్షాకాల వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్న సమయంలో తాము పనులన్నీ వదులుకుని వస్తే, రైతు వేదికలో ఖాళీ కుర్చీలు మాత్రమే అధికారులు సమయానికి హాజరుకాకపోతే ఆ లక్ష్యం నెరవేరదని రైతులు అభిప్రాయపడ్డారు. దూరాభారం నుంచి ప్రయాణ ఖర్చులు భరించి వస్తున్నా అధికారులు లేకపోవడంతో నిరాశతో వెనుదిరగాల్సి వస్తోందని, ప్రతి వారం ఇదే పరిస్థితి పునరావృతమవుతోందని మండిపడ్డారు. దీనిపై ఉన్నతాధికారులు వెంటనే స్పందించి విచారణ జరపాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు రాకుండా రైతు వేదికల్లో అధికారుల హాజరును కచ్చితంగా పర్యవేక్షించాలని విజ్ఞప్తి చేశారు.

## మిర్జాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో వారోత్సవాలు

**ప్రజాపక్షం / భైంసా :** భైంసా పట్టణంలోని మిర్జాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో సహకర వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా సంఘంగం చైర్మెన్ ఆమెడ దేవందర్ రెడ్డి మాట్లాడుతూ, రైతుల అభివృద్ధికి సహకార సంఘాలు ఎంతో కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. రైతులకు తక్కువ డ్డీపై రుణాలు అందించడం, ఎరువులు, విత్తనాలు సమయానికి అందించడం ద్వారా సహకార సంఘాలు గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు బలంగా నిలుఉన్నాయని పేర్కొన్నారు. సహకార సంఘాల బలోపేతానికి ప్రతీ రైతు సహకరించాలని, ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు సంక్షేమ పథకాలను రైతులకు చేరదీయడంలో సహకర సంఘాలు వారదిగా పనిచేస్తున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీఈఓ రాజేందర్ డైరెక్టర్లు చంద్రకాంత్ రెడ్డి, శ్రీనివాస్ సంఘ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌తో ఆవు మృతి



**ప్రజాపక్షం / లోకేశ్వరం :** లోకేశ్వరం మండలంలోని అబ్దుల్లాపూర్ గ్రామానికి చెందిన తోట భూమన్న ఆవు విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. స్థానిక రైతులు మాట్లాడుతూ ఆవు మృతి చెందడం వల్ల రైతు భూమన్నకు తీవ్ర నష్ఠం కలిగిందని సుమారు 70000 వేల వరకు నష్ట కలిగిందని రైతు భూమన్న కు ఆపార నష్టం కలిగిందని అధికారులు నాయకులు స్పందించి రైతుకు న్యాయం జరిగేలా , నష్ట పరిహారారం అందించాలని కోరారు.

## మోర్తాడ్‌లో సహకార జెండా ఆవిష్కరణ

**ప్రజాపక్షం/మోర్తాడ్:** నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండల కేంద్రంలో సోమవారం రోజు సహకార మంత్రిత్వ శాఖ ఐదవ స్థాపన దినోత్సవ సందర్భంగా మోర్తాడ్ సోసైటీలో సోసైటీ అధ్యక్షులు బద్ధం అశోక్ రెడ్డి, సహకార జెండా ఆవిష్కరణ చేయడం జరిగింది. అనంతరం సహకార సంఘం అధ్యక్షులు డైరెక్టర్లచే ప్రతిజ్ఞ చేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు భూమన్న, భూతిపురం మహిపాల్, ఎలాల భూమారెడ్డి, బైతా బాల మల్లేష్, ముత్యాల లక్ష్మ ణ్, కుంట అశోక్ రెడ్డి, సంఘ సంఘ సిబ్బంది, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## ప్రజావాణికి 122 ఫిర్యాదులు



**ప్రజాపక్షం/నిజామాబాద్‌:** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 122 ఫిర్యాదులు అందాయి. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్లు కిరణ్‌కుమార్, భుజంగరావు, ట్రేనీ కలెక్టర్ సురేష్, డీఆర్ఓ గీత, నగరపాలక సంస్థ కమీషనర్ దిలీప్‌కుమార్, జడ్పీ సీఈఓ సాయగౌడ్, డీపీఓ శ్రీనివాస్, డీఆర్‌డీఓ సాయన్నలకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. అన్ని శాఖల అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. వేసవి సెలవుల అనంతరం విద్యాసంస్థలు తిరిగి ప్రారంభమైన నేపథ్యంలో మండల ప్రత్యేకాధికారులు, మండల విద్యాదికారులు క్షేత్రస్థాయిలో విధిగా సందర్శిస్తూ సౌకర్యాలను పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పల్స్‌పోలియో

**ప్రజాపక్షం/బాల్కొండ :** మండలంలోని కిసాన్‌నగర్‌లో ప్రారంభమైన పల్స్‌పోలియో కార్యక్రమాన్ని పరిశీలించారు. 05 సంవత్సరాల పిల్లలకు చుక్కలు అందించామన్నారు. కార్యక్రమంలో వైద్యులు సాయి, స్రవంతి, కుమార్ గౌడ్, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## భూము రీసర్వేపై అవగాహన

**ప్రజాపక్షం/బాల్కొండ :** భూము రీసర్వే, గ్రామ సరిహద్దులపై మండల పరిధిలోని కిసాన్‌నగర్‌లో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. ఈ సదస్సులో కిసాన్‌నగర్‌కు చెందిన సర్వే నెంబర్లను రీసర్వే, గ్రామ సరిహద్దులను గుర్తించడంపై మంగళవారం అవగాహన నేపథ్యంలో గ్రామ పరిధిలోని పట్టా పాస్‌బుక్‌లు, భూ యజమానులు పాల్గొనాలన్నారు. ఈ సదస్సు మధ్యాహ్నం 2 గంటల నుండి 5 గంటల వరకు ఉంటుందని ఈ కార్యక్రమానికి జిల్లా ఉన్నతాధికారులు హాజరవుతారన్నారు.

## పిట్లం ప్రభుత్వ ఆసుపత్రికి ఫ్రిడ్జ్ అందజేత

**ప్రజాపక్షం/పిట్లం:** పిట్లం లయన్స్‌క్లబ్ మాజీ రీజియన్ చైర్మెన్ కాచం రాజేంద్రప్రసాద్ జన్మదినం సందర్బంగా సోమవారం పిట్లం ప్రభుత్వ ఆసుపత్రికి ఫ్రిడ్జిని వితరణ చేశారు. వాక్సీన్ స్టోరేజ్ కొరకు ఫ్రిడ్జి అవసరం ఉందని ఫార్మాసిస్టు శ్రీనివాస్ లయన్స్ అధ్యక్షులు నారాయణ దృష్టికి తేవడంతో రాజేంద్రప్రసాద్ వెంటనే స్పందించి ఆసుపత్రికి రూ 16 వేల విలువ చేసే ఫ్రిడ్జిని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శుభాంగికి అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి బాలు, కోశాధికారి మారుతిరెడ్డి, రీజియన్ కోఆర్డినేటర్ వేణుగోపాల్, సభ్యులు లక్ష్మీ నారాయణ, చంద్రశేఖర్, అశోక్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


# నిర్మల్ సోఫీనగర్ గురుకులంలో చట్టవిరుద్ధ నియామకాలు...

### ప్రిన్సిపాల్ ను సస్పెండ్ చేయాలి... టిజీవీపీ



**ప్రజాపక్షం / నిర్మల్ టౌన్ :** నిర్మల్ జిల్లా కేంద్రంలోని సోఫీనగర్ సాంఘీక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల జూనియర్ కళాశాలలో కాంట్రాక్టు ఉద్యోగ నియామకాల్లో భారీ అక్రమాలు చోటుచేసుకున్నాయని, దీనిపై తక్షణమే సమగ్ర విచారణ జరిపిచాలని తెలంగాణ విద్యార్థి పరిషత్ (టీజీవీపీ) డిమాండ్ చేసింది. ఈ మేరకు నిర్మల్ జిల్లా కలెక్ట్‌కు టీజీవీపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ మరియు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు కొట్టూరి ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో సోమవారం ఒక వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ సోఫీనగర్ గురుకుల పాఠశాలలో సోషల్ పిజీటిగా విధులు నిర్వహిస్తున్న శ్రీమతి ఎన్ మేరీ మార్గరేట్ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా తన భర్త సురేష్‌ను అదే పాఠశాలలో కంప్యూటర్ ఆపరేటర్‌గా కాంట్రాక్టు ఉద్యోగంలో నియమించుకున్నారని ఆరోపించారు. ఏలాంటి నోటిఫికేషన్ ఇవ్వకుండా, కనీస పారదర్శకత పాటించకుండా కేవలం అధికార దుర్వినియోగానికి పాల్పడి ఈ నియామకంఒ చేపట్టారని మండిపడ్డారు. ఈ విషయమై పాఠశాల ప్రిన్సిపాల్‌ను వివరణ కోరగా బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తూ , ఏజెన్సీకి వెళ్ళి అడగండని దురుసుగా సమాధానం చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. సదరు వ్యక్తి అక్కడ పనిచేస్తున్న ఉద్యోగి భర్త అని తెలిసి కూడా ప్రిన్సిపాల్ విధుల్లోకి ఎలా అనుమతించారని ఆయన ప్రశ్నించారు. అంతేకాకుండా, కంప్యూటర్ ఆపరేటర్‌గా చేరిన సురేష్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన వ్యక్తి కాకపోవడం స్థానిక నిరుద్యోగులకు జరుగుతున్న ఘోర అన్యాయమన్నారు. అందువల్ల నిబంధనలకు విరుద్ధంగా జరిగిన ఈ కంప్యూటర్ ఆపరేటర్ నియామకాన్ని తక్షణమే రద్దు చేసి సదరు వ్యక్తి విధుల నుండి తొలగించాలని డిమాండ్ చేయారు. ఆ ఉద్యోగాన్ని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన అర్హులైన నిరుద్యోగ మహిళలకే కేటాయించాలని కోరారు. అక్రమ నియమకానికి సహకరించి, చోద్యం చూస్తూ బాధ్యతారహిత్యంగా మాట్లాడిన ప్రిన్సిపాల్‌ను తక్షణమే సస్పెండ్ చేయాలని, అలాగే ఏలాంటి నోటిఫికేషన్ ఇవ్వకుండా చట్టవిరుద్ధంగా నియామకాలు చేపట్టిన సదరు కాంట్రాక్ట్ ఏజెన్సీని మీ ద్వారా రద్దు చేయాలని కలెక్టర్‌కు విన్నవించారు. స్థానిక నిరుద్యోగుల హక్కులను కాలరాస్తున్న ఇలాంటి అక్రమాలపై జిల్లా కలెక్టర్ తోణమే స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ విద్యార్థి పరిషత్ తరపున కోరారు. ఈ కార్యక్రమంలో టీజీవీపి నాయకులు విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ చేపట్టాలి : సుదర్శన్‌రెడ్డి




**ప్రజాపక్షం/నిజామాబాద్ :** భారత ఎన్నికల సంఘం నిర్దేశిత కార్యాచరణ ప్రకారం ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ చేపట్టాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి అన్నారు. సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, ఈఆర్ఓలు, ఏఈఆర్‌ఓలతోసమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. నిర్దేశిత కార్యాచరణ ప్రకారం ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, సేకరణ, వివరాల నమోదు ప్రక్రియను సమర్థవంతంగా చేపట్టాలని తెలిపారు. జూలై 24 వరకు ఇంటింటి సర్వే నిర్వహించి ప్రతి అర్హులైన ఓటరుకు ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేసి పూరించి తర్వాత సేకరించాలని ఫారాల పంపిణీ ప్రక్రియను జూలై 1 నాటికి పూర్తి చేసి ప్రతిరోజూ పురోగతి నివేదికలను సమర్పించాలని తెలిపారు. ప్రతి బూత్‌స్థాయి అధికారి తమ పరిధిలోని ఓటర్ల వివరాలను క్షేత్రస్థాయిలో ధృవీకరించి ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లు, ఒకే పోలింగ్ కేంద్రంలో నమోదై ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఓటరుగా నమోదు కావటం చట్టరీత్యా శిక్షార్హమని ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. పేర్లు, ఇంటి పేర్లు, మహిళల వివాహానంతర ఇంటి పేరు మార్పులు వంటి వ్యత్యాసాలను పరిశీలించి వివరాలు స్పష్టంగా నమోదు చేయాలని తెలిపారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియ వేగవంతంగా కొనసాగుతుందని తెలిపారు. ఇప్పటికే 72 శాతం ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ పూర్తయిందన్నారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో, బీఎల్ఏలతో క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ భుజంగరావు, ఆర్మూర్ సబ్‌కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, నగరపాలక సంస్థ కమీషనర్ దిలీప్‌కుమార్, బోధన్ ఆర్డీఓ విజయలక్ష్మి, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు బాలరాజు పాల్గొన్నారు.

## వరుణుడి కరుణతో.. పొలం బాట పడుతున్న రైతన్నలు

- ఎడపల్లి మండలంలో ఊపందుకున్న వ్యవసాయ పనులు
- ఈ ఏడాది పదివేల హెక్టార్లలో వరి సాగు అంచనా



**ప్రజాపక్షం/ఎడపల్లి:** వర్షాకాలం ప్రారంభమై పదిహేను రోజులు గడుస్తున్నా.. వానలు కురవకపోవడంతో ఆందోళనలో ఉన్న రైతాంగానికి ఎట్టకేలకు ఉపశమనం లభించింది. వరుణ దేవుడు కరుణించడంతో గత ఆదివారం మండల వ్యాప్తంగా సుమారు రెండున్నర గంటల పాటు విస్తారంగా వర్షం కురిసింది. ఈ అకాల నిరీక్షణకు తెరదించుతూ కురిసిన భారీ వర్షంతో రైతన్నల గుండెల్లో ఆనందం వెల్లివిరిసింది. ఇకపై వర్షాలు క్రమబద్ధంగా, విస్తారంగా కురుస్తాయనే నమ్మకంతో రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తూ.. మళ్లీ పొలం బాట పడుతున్నారు.

**సకాలంలో స్పందించిన ప్రకృతి.. నిమగ్నమైన రైతాంగం**

మండలంలోని కొందరు రైతులు ముందస్తు ప్రణాళికతో వ్యవహరించారు. గత నెలలోనే తమ బోరు మోటర్ల కింద ఉన్న పంట భూముల్లో నారు మడులను సిద్ధం చేసుకున్నారు. వరినారు విత్తనాలను వేసి నాట్లకు వీలుగా నారును పెంచి ఉంచారు. ప్రస్తుత వర్షాలు తోడవడంతో ఆయా రైతులు ఆలస్యం చేయకుండా తమ పొలాల్లో వరినాట్ల ప్రక్రియను అప్పుడే ప్రారంభించేశారు. మునుముందు మరిన్ని వర్షాలు పడితే నాట్ల వేగం మరింత పుంజుకోనుంది

**పది వేల హెక్టార్లలో వరిసాగు లక్ష్యం...**

ప్రస్తుత సాగు సీజన్‌పై వ్యవసాయ శాఖ అధికారులు ప్రాథమిక అంచనాలను వెల్లడించారు. ఈ ఏడాది కూడ ఎడపల్లి మండలంలో వరి సాగు రికార్డు స్థాయిలో ఉండే అవకాశం ఉందని వారు తెలిపారు. మండల వ్యాప్తంగా సుమారు 9,500 నుంచి పది వేల హెక్టార్లలో వరి పంట సాగు కానుందని అధికారులు అంచనా వేస్తున్నారు.రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు సకాలంలో అందుబాటులో ఉంచేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. వర్షాలు ఇలాగే అనుకూలిస్తే ఈ ఏడాది ఆశించిన మేర దిగుబడులు సాధించవచ్చని రైతులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

## ఆర్మూర్ పట్టణంలో సెక్షన్ 163 బిఎన్ఎస్ఎస్ అమలు



**ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్ :** ఆర్మూర్ పట్టణంలో సెక్షన్ 163 బిఎన్ఎస్ఎస్ (పాత సెక్షన్ 144 సిఆర్‌పిసి) సోమ, మంగళ వారాలు ఈనెల 29 ఉదయం 6 గంటల నుండి 30వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు అమలులో ఉంటుందని నిజామాబాధ్ పోలీస్ కమీషనర్ పి. సాయి చైతన్య ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్మూర్ పట్టణంలోని భరత్ చంద్ర స్కూల్లో జరిగిన సంఘటన సందర్భంగా ఆర్మూర్ పట్టణంలో ప్రశాంత వాతావరణం నెలకొల్పే నిమిత్తం ఇట్టి సెక్షన్ 163 బిఎన్ఎస్ఎస్ అమలు చేయడం జరిగిందన్నారు. జిల్లాలో బందులు, ధర్నాలు, ర్యాలీలు, రాస్తారోకోలు నిషేదం ఉంటుందన్నారు. ఆర్మూర్ పట్టణంలో ప్రజాశాంతికి ఎక్కడ ఎలాంటి భంగం కలగడం ముందస్తు జాగ్రత్తలు భాగంగా పోలీస్ శాఖ తరపున కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. ఈ ఉత్తర్వుల ప్రకారం ఆర్మూర్ పట్టణంలో 5 మంది మించి గుంపులుగా చేరడం నిషేదం. ఆర్మూర్ పట్టణంలో అనుమానాస్పద వ్యక్తులపై నిఘా ఉంచుతామని పోలీస్ కమిషనర్ తెలిపారు. ఈ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## అంతర్జాతీయ స్థాయిలో ఇందూరు క్రీడాకారులు

### ఒలంపిక్ రన్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే ధన్‌పాల్



**ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్ :** నిజామాబాద్ జిల్లాలో క్రీడాకారులకు వసతులు లేకున్నా ఆయా క్రీడాంశాల్లో అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్నారని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా అన్నారు. సోమవారం స్థానిక ఆర్ఆర్ చౌరస్తాలో ఒలంపిక్ రన్‌ను అర్బన్ ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. ఒలంపిక్స్ అంటే కేవలం క్రీడలు మాత్రమే కాదని ప్రపంచ దేశాల మధ్య స్నేహం, శాంతిలకు ప్రతీక అన్నారు. ఆరోగ్యకరమైన జీవన శైలికి క్రీడలు ఎంతో అవసరమన్నారు. క్రమశిక్షణ అంకితభావం క్రీడల ద్వారా అలవడతాయన్నారు. జిల్లాలో క్రీడలకు సరైన సౌకర్యాలు లేవని రాష్ట్ర ప్రభుత్వం స్పందించి స్టేడియం నిర్మించాల్సిన అవసరమెంతైనా ఉందన్నారు. ఇప్పటికే అనేకసార్లు మంత్రుల దృష్టికి తీసుకెళ్ళినా ఫలితం లేదన్నారు. పిసిసి అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ చొరవ తీసుకొని స్టేడియం నిర్మాణానికి కృషి చేయాలన్నారు. జిల్లా నుంచి అంతర్జాతీయ క్రీడాకారులు గుగులోత్ సౌమ్య, ఎండల సౌందర్య, హుసాముద్దీన్ తదితరులు స్ఫూర్తిగా నిలుస్తున్నారన్నారు. కార్యక్రమంలో పిసిసి అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, మేయర్ కూరగాయల ఉమారాణి, ఒలంపిక్ అసోసియేషన్ ప్రతినిధులు భక్తవత్సలం, బొబ్బిలి నరసయ్య, ఆయా క్రీడా సంఘాల ప్రతినిదులు, బిజెపి కార్పొరేటర్లు నాగోల లక్ష్మి నారాయణ, బట్టు రాఘవేందర్, మల్కాయి మహేందర్, జ్యోతి మురళి పాల్గొన్నారు.

## చిల్లర్గిలో ప్రీ ప్రైమరీ పాఠశాల ప్రారంభం



**ప్రజాపక్షం/పిట్లం:** పిట్లం మండలంలోని చిల్లర్గి గ్రామంలో ప్రీ ప్రైమరీ పాఠశాలను సోమవారం గ్రామసర్పంచు రాధ మురళీధర్‌గౌడ్ ప్రారంభించారు. ముందుగా జ్యోతిప్రజ్వలన చేసి చిన్నారులచే అక్షరాభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచు సయ్యద్ హుస్సేన్, మండల విద్యాశాఖ అధికారి దేవిసింగ్, రాంపూర్ కాంప్లెక్స్ హెచ్ఎం శ్రీలత, ఇంచార్జీ ప్రధానోపాధ్యాయులు విఠల్, జడ్పీ హైస్కూల్ చిల్లర్గి ప్రధానోపాధ్యాయుడు హరిసింగ్, సిబ్బంది గంగాధర్, నవీన, హన్మండ్లు, హేంసింగ్, ఇన్‌స్ట్రక్టర్ భాగ్య, చిన్నారులు పాల్గొన్నారు.

## నూతన అటవీశాఖ రేంజ్ ఆఫీసర్‌గా హిమ చందన

**ప్రజాపక్షం/పెద్ద శంకరంపేట్ :** కామారెడ్డి జిల్లా గాంధారి అటవీశాఖ రేంజ్ ఆఫీసర్ గా విధులు నిర్వర్తించి పెద్ద శంకరంపేట నూతన అటవీ శాఖ రేంజ్ ఆఫీసర్ గా హిమ చందన సోమవారం బాధ్యతలు స్వీకరించారు. పెద్ద శంకరంపేటలో విధులు నిర్వరించిన అటవీశాఖ రేంజ్ ఆఫీసర్ వికాస్ మంచిర్యాల జిల్లా జేన్నారం ఆలంపేట రేంజ్ ఆఫీసర్ గా బదిలీ పై వెళ్లారు. అనంతరం నూతన అటవీ శాఖ అధికారి బాధ్యతలు స్వీకరించిన హిమచందన మాట్లాడుతూ అటవీ సంపద పరిరక్షణ అక్రమ అటవీ కార్యకలాపాల నియంత్రణకు ప్రాధాన్యత ఇస్తూ సమర్ధవంతంగా విధులు నిర్వహిస్తానని ఆమె తెలిపారు. అదేవిధంగా ఎంతటి వారైనా నిబంధనలకు విరుద్ధంగా అక్రమ కలప నరికిన అక్రమ కలప రవాణాకు పాల్పడిన వ్యక్తుల పట్ల ఎవరైనా సమాచారం తెలియజేస్తే తెలియపరచిన వ్యక్తుల పేర్లను గోప్యంగా ఉంచి నిబంధలనలకు విరుద్ధంగా పాల్పడుతున్న వ్యక్తుల పై చట్టపరమైన చర్యలు తీసకుంటానని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ అధికారులు సిబ్బంది ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

## శ్రీగురుపీఠంలో పౌర్ణమి పూజలు..

**ప్రజాపక్షం/శివ్వంపేట :** మండలంలోని గూడురు గ్రామంలోని శ్రీగురుపీఠంలో ఏరువాక పౌర్ణమి సందర్భంగా దత్తాత్రేయ మహాస్వామికి, షిరిడిసాయినాథ దేవాలయాల్లో ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ పూజ కార్యక్రమాలకు శ్రీగురుపీఠం ఛైర్మన్ శివకుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు. దత్తాత్రేయ మహాస్వామి పంచాయతనంలో అభిషేకం, అర్చన, సాయిబాబా దేవాలయంలో కాకడ హారతి, మద్యాహ్న హారతి ఇచ్చారు. ఈ పూజలకు జిల్లా గ్రంధాలయ సంస్థ ఛైర్మన్ సుహాసిని రెడ్డి, పీఏసీఎస్ ఛైర్మన్ వెంకటరాంరెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షులు సుదర్శన్‌గౌడ్, గూడురు సర్పంచ్ బేగరి నర్సయ్య, మాజీ సర్పంచ్ స్వరాజ్యలక్ష్మి శ్రీనివాస్‌గౌడ్, సూర్యంకుమార్‌గౌడ్, తదితరులు ఉన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**ప్రజాపక్షం/నర్సాపూర్:** నర్సాపూర్ లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1979–80 సంవత్సరం బ్యాచ్ కి చెందిన విద్యార్థులు పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరుపుకున్నారు. నర్సాపూర్ లోని అర్బన్ పార్క్ లో ని కాటేజ్ సమావేశ మందిరంలో ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ సమావేశంలో పూర్వ విద్యార్థులు 46 మంది పాల్గొని ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా జరుపుకున్నారు.

# మెదక్ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతాం

### ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు



**ప్రజాపక్షం/రామాయంపేట:** మెదక్ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు అన్నారు. మంగళవారం రామాయంపేటలో మండలంలో విస్తృతంగా పర్యటించిన ఆయన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపలు, ప్రారంభోత్సవాలు జరిపారు. రామాయంపేటకు చేరుకున్న ఎమ్మెల్యేకు కాంగ్రెస్ పార్టీ నాయకులు బైక్ ర్యాలీతో స్వాగతం పలికారు. ప్రభుత్వ ఆసుపత్రిలో చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. 1వ వార్డులో సమ్మక్కసారలమ్మ దేవాలయ ప్రహారి నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం పలు వార్డులతో పాటు పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో ఎంఎస్‌ఎస్‌వో ద్వారా బోరు మోటార్లు ప్రారంబించారు. హమాళీ కార్మికులకు ప్రమాద భీమా పత్రాలను పంపిణీ చేసిన అనంతరం సర్పంచుల ఫోరం కార్యాలయాన్ని ప్రారంబించారు. తొనిగండ్ల గ్రామంలో నిర్మించిన మహిళా భవనాన్ని ప్రారంబించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రామాయంపేట పట్టణ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ గజవాడ నాగరాజు, వైస్ చైర్మెన్ పోచమ్మల నవనీత గణేష్, కౌన్సిలర్లు గుగులోతు రవి, బైరం స్వప్న, పుట్టి సందీప్, గజవాడ నాగరాజు, దేవుని రంజిత్, దాకి శ్యామల స్వామి, సర్పంచుల ఫోరం అద్యక్షులు మానెగల్ల రామకిష్టయ్య, మండల పార్టీ అద్యక్షులు బండారి మహేందర్‌రెడ్డి, సీనియర్ నాయకులు సరాఫు యాదగిరి, రమేష్‌రెడ్డి, కోఅప్షన్ సభ్యులు దేమె యాదగిరి, గౌస్, సర్పంచులు వెంకుగారి ఉమా సంజీవరెడ్డి, సునీల్, పెండెల మమత రవి, శ్రీనివాస్‌గౌడ్, గట్టు సుశీల ప్రశాంత్, శివకుమారి నాగులు, కొత్త స్రవంతి, బస్సీనాయక్, తార్యానాయక్, రాణిరాజుతో పాటు కాంగ్రెస్ నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం రాయిలాపూర్ గ్రామ వార్డు సభ్యులు కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి పార్టీ కండువా వేసి ఆహ్వానించారు.

# ప్రతి ఊరికి ఇందిరమ్మ ఇల్లు ఇచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమే

### మెదక్ ఎమ్మెల్యే రోహిత్ రావు



**ప్రజాపక్షం/నిజాంపేట్ :** ప్రతి గ్రామానికి ఇందిరమ్మ ఇళ్లు అందించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వాదేనని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ అన్నారు. సోమవారం నిజాంపేట్ మండల కేంద్రంలోని రైతు వేదికలో కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మెదక్ నియోజకవర్గంతో పాటు నిజాంపేట మండలాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. మండలానికి తహసీల్దార్ కార్యాలయం మంజూరు చేసి రూ 2.25 కోట్లతో నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. ప్రభుత్వం 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సుప్రయాణం, రైతులకు రూ 2 లక్షల వరకు రుణమాఫీ వంటి సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. తహసీల్దార్ కార్యాలయం మంజూరు చేసినందుకు ఎమ్మెల్యేకు తహసీల్దార్ శ్రీనివాస్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# 'సర్' ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ ప్రక్రియ గడువులోగా పూర్తి

### అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష: హాజరైన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ ప్రక్రియ గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి, ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించి ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించగా, జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నిర్ణీత గడువులోగా ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాల వారీగా ఇప్పటివరకు పూర్తి చేసిన ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ వివరాలు సమీక్షించారు. బూత్ లెవెల్ అధికారులు (బీఎల్‌ఓలు) తప్పనిసరిగా ఇంటింటికీ వెళ్లి ఫారాలు అందివ్వాలని ఆదేశించారు . బీఎల్‌ఓ లు మాత్రమే ఫారాలు పంపిణీ చేయాలని స్పష్టం చేశారు. బీఎల్‌ఓలు తప్పనిసరిగా ఐడీ కార్డులు ధరించాలని తెలిపారు.. ప్రజలకు ఎస్ఐఆర్ ప్రక్రియపై సందేహాలు నివృత్తి చేయడానికి హెల్ప్ డెస్క్ లు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. ఎన్యుమరేషన్ యాప్ వినియోగించేందుకు అధికారం కేవలం బీఎల్‌ఓ లకు మాత్రమే ఉందని స్పష్టం చేశారు. ప్రజలకు ఎస్ఐఆర్ ప్రక్రియపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని తెలిపారు. మీడియా, సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారం కల్పించాలని పేర్కొన్నారు. ఓటర్ల నుంచి తప్పనిసరిగా ఎన్యూమరేషన్ ఫారాలు తిరిగి తీసుకోవాలని తెలిపారు. అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, జిల్లా రెవెన్యూ అధికారి జయశ్రీ, వేములవాడ ఆర్డీఓ కే ఎస్ బీ కుమారి, తహసీల్దార్లు,ఎన్నికలవిభాగం అధికారులు సిబ్బందిఉన్నారు.

# యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి



**ప్రజాపక్షం/మంగపేట :** ప్రతిఒక్కరూ మాధకద్రవ్యాలకు దూరంగా ఉండి ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి కృషి చేయాలని ఎస్ఐ టీవీఆర్ సూరి అన్నారు. సోమవారం యాంటీ డ్రగ్స్ నిర్ములనకు ఏటూరునాగారం సిఐ సూర్యప్రకాష్ ఎస్ఐ టీవీఆర్ సూరి పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కమలాపురం ప్రభుత్వ పాఠశాల నుండి అంబేద్కర్ సెంటర్ వరకు పోలీసు శాఖ సంయుక్తంగా ప్రజల్లో మాదకద్రవ్యాలపై అవగాహన కల్పించేందుకు పాఠశాల విద్యార్థులతో ఘనంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ సూర్యప్రకాష్ ఎస్ఐ టీవీఆర్ మాట్లాడుతూ ముఖ్యంగా యువత, విద్యార్థులు చేడు వ్యసనాలకు బానిసలై, తమ విలువైన జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారు. యువత గంజాయి మద్యానికి దూరంగా ఉండి మంచిగా విద్యను అభ్యచించి తల్లిదండ్రులు పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టి బావి భారత పౌరులుగా ఎదగాలని డ్రగ్స్ ను నిర్మూలించాలని యువతకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పోలీసులు ప్రజా ప్రతినిధులు విద్యార్థులు పాల్గొన్నారు.

## రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలి




**ప్రజాపక్షం/మెదక్ :** మెదక్ జిల్లాలో రేషన్ డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జిల్లా రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ కు వినతిపత్రం అందజేశారు. ఎంఎల్ఎస్ గోదాంలలో బియ్యాన్ని తప్పనిసరిగా తూకం వేసి ఇవ్వడం, డీలర్లకు గుర్తింపు కార్డులు మంజూరు చేయడం, ఈ పాస్ ఇంజనీర్లను నియమించడం, పెండింగ్ గన్నీ బ్యాగుల బిల్లులు చెల్లించడం, ఉత్తమ సేవలందించిన డీలర్లను ప్రోత్సహిస్తూ అవార్డులు అందజేయాలని వారు కోరారు. జిల్లా ప్రధానకార్యదర్శి సుధాకర్, సత్యనారయణ, శ్రీనివాస్, పాపయ్యాచారి, షేకులు, అంతగౌడ్, శంకరయ్య, శ్రీనివాస్, బిక్షపతి, అజీమ్, నర్సింలు, సధాకర్, నాగరాజు, నరేష, ప్రకాష్, గౌడయ్య, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## పేరెంట్ టీచర్ సమావేశం



**ప్రజాపక్షం/నిజాంపేట్ :** రాంపూర్ ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల సమావేశం ఈ రోజు నిర్వహించినట్లు హెచ్ఎం పద్మారెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో పాఠశాలకు లైబ్రరీ బీరువా బహుకరించిన దాతలు ఇందిరా వెంకట్ గౌడ్ లను సన్మానించారు. ఈ సందర్బంగా జిల్లా స్థాయిలో ఈ సంవత్సరం పది శాతం ఎన్రోల్మెంట్ పెరిగిన పాఠశాలలో రాంపూర్ ఉన్నత పాఠశాల ఒకటి అని హెచ్ఎం తెలిపారు. ఇందుకు సహకరించి, విద్యాబుద్దులు నేర్పిన హెడ్మాస్టర్, ఉపాధ్యాయులను గ్రామస్తులు అభినందించారు. ఈ సమావేశంలో గ్రామ సర్పంచ్ ప్రవీణ్ కుమార్, ఏఏపీసీ చైర్మన్ యాదమ్మ, ఉపాధ్యాయులు ఈశ్వరయ్య, అర్జున్, సుకన్య, నరేష్, చంద్రకాంత్, కుమారస్వామి, వార్డ్ నెంబర్ సతీష్ విద్యార్థుల తల్లిదండ్రులు రాజు, ఫిరోజ్, దేవరాజు, నవీన్, దుర్గరాజు, నవ్య, భాగ్య, సౌందర్య, కళ్యాణి, హామీద తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల నిర్మాణానికి కరెంట్ తీగ అడ్డు



**ప్రజాపక్షం/నిజాంపేట్ :** నిజాంపేట మండల కేంద్రంగా జద్చర్ల తండా రోడ్లో పెద్దమ్మ టెంపుల్ ఆవరణలో కస్తూర్బా పాఠశాలకు కన్స్ట్రక్షన్ నిర్మాణం జరుగుతుంది. ఆ నిర్మాణానికి నిజాంపేట సబ్స్టేషన్ నుండి జద్చర్ల రోడ్లలో ఉన్న రైస్ మిల్కు 11 కేవీ కరెంటు లైన్ తీసుకెళ్లడం జరిగింది. ఈ క్రమంలో ప్రస్తుతం నిజాంపేట మండల కేంద్రానికి కస్తూర్బి పాఠశాల మంజూరు కావడం జరిగింది. ప్రభుత్వపరంగా భవనం నిర్మాణం ఆలస్యమైతున్నందున నిజాంపేట గ్రామానికి చెందిన తాడెం తిరుపతి ఇల్లు కన్స్ట్రక్షన్ నిర్మాణాన్ని కస్తూర్బా పాఠశాలకు నిర్మాణం చేయాలని అధికారుల నిర్ణయం మేరకు పాఠశాల పనులు చకచక నడుస్తున్న క్రమంలో పైన నిర్మాణంలో రోడ్డంబడి వెళ్లిన 11 కెవి కరెంటు తీగలు అడ్డు రావడంతో నిర్మాణ పనులు ఆగిపోయాయి. ఈ కరెంటు తీగకు సంబంధించిన రైస్ మిల్ బాధితులను ఎన్ని సార్లు మొరపెట్టుకున్న పని సమస్య పరిష్కారం కాలేదని కరెంటు అధికారులు ఎన్నిసార్లు విన్నవించుకున్న పట్టించుకునే నాధుడే లేదని ప్రజలు ఆవేదన చెందుతున్నారు.